# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 14 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 68 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**అవసరం లేకపోతే గ్యాస్ బుక్ చేయొద్దు**



2

**సీఈసీ అభిశంసనకు నోటీసులు**



2

## మూసీ ఫ్రంట్‌ను వ్యతిరేకిస్తున్న వాళ్లు

# మూణ్ణెల్లు దానిపక్కనుండండి

### అభివృద్ధి జరగొద్దనే తప్పుదోవ పట్టిస్తున్నరు


- వ్యతిరేకించడం కాదు, సలహాలిస్తే స్వీకరిస్తం
- ఇంకా డీపీఆర్ సిద్ధం కాలేదు, అప్పుడే విషం చిమ్ముతున్నరు
- 20 టీఎంసీల గోదావరి జలాలతో మూసీని శుభ్రం చేద్దామనుకుంటున్నం
- అభివృద్ధి చేసుకోకుండా రాతియుగం వైపు వెళదామా?
- మీరంతా వద్దని చెప్తే ప్రాజెక్టును ఇప్పుడే ఆపేస్తా
- హిందువుగా కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా, ఇతర మతాలనూ గౌరవిస్తా
- నమ్మి అధికారం ఇచ్చిన ప్రజలకు కాపలాదారుగా ఉంటం
- తప్పుడు ప్రచారం నమ్మొద్దు, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుంది
- అభివృద్ధిని అందుకుందామనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం
- మూసీ పునరుజ్జీవంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (మనం బ్యూరో): ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారు. ఆ ప్రజలకు కాపలాదారులుగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆ అభివృద్ధిని అందుకోవాలనే మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు తలపెట్టామని పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడి తాజ్‌కృష్ణ హోటల్‌లో మూసీ నది పునరుజ్జీవం ఆవశ్యకత, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ తొలి దశలో చేపట్టే ప్రాజెక్టులపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాల్లో నదీ పరివాహక ప్రాంతాలే ఎక్కువగా అభివృద్ధి చెందాయనీ, సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ దేశాలు తిరిగామనీ, ఏం అవసరమో అక్కడ స్టడీ చేశామనీ, వేగంగా

...మిగతా 2లో





## పశ్చిమాసియాలో బీభత్సం

# భీకర దాడులు



- ఇరాన్ నగరాల్లో భారీ పేలుళ్లు
- అమెరికా విమాన వాహక నౌకపైకి ఇరాన్ క్షిపణుల దండు
- కుప్పకూలిన అమెరికా రీఫ్యూయలింగ్ ఫ్లైట్
- ఆరుగురు అగ్రరాజ్య సైనికుల మృతి!

పశ్చిమాసియాలో యుద్ధం మరింతగా ముదురుతోంది. పరస్పర దాడులతో ఇరాన్, దాని సమీప ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. గురు,శుక్రవారాల్లో అమెరికాకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలపై ఇజ్రాయెల్ బాంబు దాడులు చేసింది. అయినా, ఆందోళన కారులు వెనక్కి తగ్గకపోవడం గమనార్హం. మరో పక్క ఇరాన్ కూడా శత్రు వర్గాలపై విరుచుకుపడుతూనే ఉంది. అమెరికాకు చెందిన అగ్ర శ్రేణి విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై క్షిపణులతో దాడులు చేసి దాన్ని ధ్వంసం చేసింది. అయితే, ఇదంతా ఏం లేదు అని అమెరికా సైనిక వర్గాలు ప్రకటించాయి. మరో పక్క, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానాన్ని కూడా ఇరాన్ అనుకూల సంస్థ ఇరాక్‌లో కూల్చివేసింది.

...వార్తలు 2లో

## గ్యాస్‌పై గందరగోళం వద్దు.. ప్రజలకు కావల్సినంత స్టాక్ ఉంది



2

- ఆందోళనలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేస్తే కఠిన చర్యలు
- గ్యాస్ కొరతపై సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో హైలెవల్ కమిటీ

**ఎల్పీజీ ట్యాంకర్లను హర్మూజ్ దాటించేందుకు**

## ఇరాన్‌తో భారత్ చర్చలు!

2



### నేటి నుంచి టెన్త్ ఎగ్జామ్స్

## All The Best

హైదరాబాద్, మార్చి 13: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేసినట్టు

...మిగతా 2లో

హృదయ పూర్వక శుభాకాంక్షలు
గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయండి



2

- స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయాలె
- వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

**ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ**

## హెచ్‌జే దొర కన్నుమూత



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం నిమ్స్‌లో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు బాత్రూమ్ లోపడిపోయారు. కుటుంబ సభ్యులు మళ్లీ ఆయన్ను నిమ్సుకు తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

...వివరాలు 3లో

**రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు**

### రేవంత్ రెడ్డి, చంద్రబాబు సంతాపం

## 17న సెకండ్ నేషనల్ మొబిలిటీ సమ్మిట్

రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలపై చర్చ



హైదరాబాద్, మార్చి 13 (మనం బ్యూరో): ఈనెల 17న హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో సెకండ్ నేషనల్ మొబిలిటి సమ్మిట్-2026 జరుగనుంది. దేశంలో రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, నగరం రవాణా అభివృద్ధి వంటి అంశాలపై ఈ సమ్మిట్‌లో చర్చించనున్నారు. ఈ సమ్మిట్ నిర్వహణపై శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్, ఎలేట్స్ టెక్నో ప్రతినిధుల సమావేశం జరిగింది. ఎలేట్స్ టెక్నో మీడియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రవాణా శాఖ ముఖ్య భాగస్వామిగా ఉంది. ఈ సమ్మిట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్, కార్బన్ ఉద్గారాల తగ్గింపుపై విస్తృత చర్చలు జరుగుతాయి. స్మార్ట్ మొబిలిటీ టెక్నాలజీలు ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, డిజిటల్ టికెటింగ్,

...మిగతా 2లో

# లొంగారా.. లొంగ దీశారా..!

- ఖాకీల తీరుపై మావోల భిన్న స్వరాలు
- లొంగలేదని మాజీ మావోల వ్యాఖ్యలు
- మరి..! అరెస్ట్ చేస్తే...రిమాండ్ లేదా..!
- లోగోల ముందు మావోల గోల
- ఉనికి కోసం ఉన్నవీ..లేనివి
- పార్టీపై మావో...నే'తలో' మాట
- ఖాకీల, కగార్‌పై పొంతన లేని ప్రకటనలు



హైదరాబాద్,మార్చి 13(మనం, ప్రత్యేక ప్రతినిధి): ఇటీవల అరణ్యం వీడి జనారణ్యంలో కలిసిన మాజీ మావోయిస్టు నేతలు తమ లొంగుబాటుపై భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. ముఖ్యంగా తమది లొంగుబాటు కాదని, పోలీసులే అరెస్ట్ చేసి సరెండర్‌గా చూపారని మాజీ మావోయిస్టు నేత మల్లా రాజిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే దేవ్ జీ సైతం తాము పోలీసుల ఎదుట లొంగిపోలేదని, మొదటి నుంచీ జనజీవన స్రవంతిలోనే ఉన్నామన్నారు. మావోయిస్టు పార్టీ అత్యంత కీలక సమయాల్లో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. మరోవైపు మావోయిస్టు పార్టీని విస్తరించడంలో తాము విఫలమయ్యామని ఆయన అంగీకరించారు.చట్టం పరిధిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ మావోయిస్టు పార్టీ అగ్రనేత దేవ్జీ మీడియా ఎదుట ప్రకటించారు.

**భిన్నస్వరాలు:**

మాజీ మావోయిస్టు మల్లా రాజిరెడ్డి తాము పోలీసుల లొంగిపోయామని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా బయటకు వచ్చి పని చేద్దామని మేమంతా చర్చించుకున్నామని ఇంతలో ఎస్ఐబీ పన్నిన వలలో చిక్కుకున్నామనే సంగతి స్పష్టమైందన్నారు. పోలీసులు

...మిగతా 9లో

## ఆర్టీసీ సమ్మె నోటీసులు

- మా డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు పోతం
- సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామన్న జేఏసీ



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు.. యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. అయితే, ఈ సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది. అయితే, 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం

...మిగతా 2లో

## నేపాల్లో న్యూ జెన్ పాలిటిక్స్‌కు బంపర్ మెజారిటీ

### ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నవతరం రాజకీయ పార్టీ ఆర్ఎస్పీ

కాఠ్మండు, మార్చి 13: నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో నవతరం రాజకీయ పక్షమైన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) మొత్తం 182 స్థానాలు దక్కించుకొని ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన దాని కన్నా ఎక్కువ మెజారిటీ సాధించింది. దీంతో ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు తయారీ జరుగుతోంది. ఆర్ఎస్పీ ప్రత్యక్ష ఎన్నిక ప్రాతిపదికన 125 స్థానాలు, దామాషా ఓటింగు ఆధారంగా 57 స్థానాలు గెలుచుకుంది. నేపాల్ పార్లమెంటులోని ప్రతినిధుల సభలో మొత్తం 275 సీట్లుండగా మెజారిటీ సాధించేందుకు 138 సీట్లు కావాలి. ఆర్ఎస్పీ ఇప్పటికే ర్యాప్ కళాకారుడు 'బాలేంద్ర షా'ను తన ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. దామాషా ఓట్ల ప్రాతిపదికన నేపాలీ కాంగ్రెస్ కు 20 స్థానాలు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు లెనినిస్టు)కి 16, నేపాలీ కమ్యూనిస్టు పార్టీకి ఎనిమిది సీట్లు వచ్చాయని నేపాల్ ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.



## భారత్-అమెరికా మధ్య క్రిటికల్ మినరల్ ఒప్పందం

### త్వరలోనే కుదరనున్నట్టు వెల్లడించిన యూఎస్ రాయబారి గోర్

ఢిల్లీ, మార్చి 13: భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్ వర్క్ పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదరగా.. తాజాగా మరో ప్రకటన వెలువడింది. ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ ఒప్పందం కుదరనున్నట్లు భారత్లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ఇండియాటుడే కాంక్లేవ్ 2026లో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. 'భారత్-అమెరికా దైపాక్షిక సహకారానికి ముఖ్యమైన రంగాల్లో

...మిగతా 2లో






9

**ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు**

- గోధుమ గింజలతో కవిత చిత్రపటం
- సంగారెడ్డి జిల్లా జాగృతి లీగల్ సెల్ శుభాకాంక్షలు

# అవసరం లేకపోతే గ్యాస్ బుక్ చేయొద్దు

## కొరత లేదే లేదని పునరుద్ఘాటించిన కేంద్రం

**ఢిల్లీ, మార్చి 13:** పశ్చిమాసియా ఘర్షణలతో ఇంధన భయాలు నెలకొన్న నేపథ్యంలో ఎల్పీజీ కొరత లేదని కేంద్రప్రభుత్వం పునరుద్ఘాటించింది. గ్యాస్ గురించి ఆందోళన చెందవద్దని, దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి 30 శాతం పెరిగిందని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో గ్యాస్ డిమాండ్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని, అవసరం లేకపోయినా ఆందోళనతో బుకింగ్లు చేయొద్దని సూచించారు.

యుద్ధానికి ముందు రోజుకు 55.7 లక్షల సిలిండర్లు బుక్ అయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం 75.7 లక్షలకు పెరిగింది. అంటే ఆందోళనతో బుకింగ్లు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం'' అని ఆమె పేర్కొన్నారు. ''ముడిచమురు విషయానికొస్తే.. మనవద్ద 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ సామర్థ్యం ఉంది. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాం. ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితంగా దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. మన రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఇదిలా ఉంటే.. ప్రధాన నగరాల్లో పూర్తిగా ఎల్పీజీపై ఆధారపడిన వాణిజ్య వినియోగదారుల ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. పీఎన్జీ సౌలభ్యమున్న ప్రాంతాల్లో కనెక్షన్ కోసం స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్)ను సంప్రదించాలని కోరుతున్నాం. అన్ని బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది. ఎల్పీజీనే ఆందోళన కలిగించే విషయంగా మారిపోయింది. 25వేల మంది డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొరత అనే మాటమాత్రం వినిపించలేదు' అని వెల్లడించారు.

# యూఎస్ఎస్ 'అబ్రహం లింకన్'పై దాడి

### అమెరికా విమాన వాహకనౌకపైకి ఇరాన్ క్షిపణుల దండు

**టెహ్రాన్, మార్చి 13:** అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్ పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్ పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది.

అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలుంటాయి.

అబ్రహం లింకన్ పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే, ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది.

విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్టైమ్ ఉపగ్రహ నెట్వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు సమాచారం.

**జెరాల్డ్లో మంటలు..**

ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్ ఆర్ ఫోర్డ్లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

''జెరాల్ లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు.

ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంటుకు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోంది' అని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

##### ఎల్పీజీ ట్యాంకర్లను హర్మూజ్ దాటించేందుకు

# ఇరాన్‌తో భారత్ చర్చలు!

**ఢిల్లీ, మార్చి 13:** దేశంలో వంటగ్యాస్ కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తుండగా.. వంటగ్యాస్ లభ్యతను పెంచేందుకు భారత్కు రావాల్సిన ఎల్పీజీ ట్యాంకర్ల కోసం ఇరాన్ తో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. భారత్కు వస్తున్న 8 ఎల్పీజీ ట్యాంకర్లు హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయాయి. వీటిని సురక్షితంగా దాటించేందుకు భారత ప్రభుత్వం ఇరాన్ తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు, ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధ జ్వాలల నుంచి రెండు చమురు నౌకలు చాకచక్యంగా బయటపడ్డాయి. ఇందులో ఒకటి బుధవారం భారత్కు చేరుకోగా.. మరొకటి రెండ్రోజుల్లో రానుంది. ఈ రెండింటి ద్వారా 3 మిలియన్ బ్యారెళ్ల చమురు అందుబాటులోకి రానుంది.





# టెహ్రాన్, ఖజ్విన్ నగరాల్లో భారీ పేలుళ్లు

### నిరసన ప్రదర్శనలపై బాంబు దాడులకు పాల్పడ్డ ఇజ్రాయెల్

### అయినా.. వెనక్కి తగ్గకుండా ఆందోళనలు కొనసాగించిన ఇరానీయులు

**టెహ్రాన్, మార్చి 13:** ఇరాన్ రాజధాని టెహ్రాన్లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. అక్కడి మరో నగరం ఖజ్విన్లోనూ భారీ పేలుడు సంభవించింది. ఈ నగరాల్లో పేలుళ్లు జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. మరోవైపు.. దాడులు జరుగుతున్నప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.

ఇరాన్కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ''ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకు పోయారు. 47 ఏండ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా'' అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ త్వరలో లొంగిపోనుందని ఇటీవల జరిగిన జీ7 నేతల వర్చువల్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది.

# కుప్పకూలిన అమెరికా రీఫ్యూయలింగ్ ఫ్లైట్

- **ఆరుగురు అగ్రరాజ్య సైనికుల మృతి!**
- **కూల్చేసినట్టు ప్రకటించిన ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల సంస్థ**

**బాగ్దాద్, మార్చి 13:** అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్ లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్ కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్ కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పని ఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

# భారత్-అమెరికా మధ్య క్రిటికల్ మినరల్ ఒప్పందం

**(మొదటి పేజీ తరువాయి)**

క్రిటికల్ మినరల్స్ కీలకమైనది. ఈ ఖనిజాల విశ్వసనీయ సరఫరా గొలుసులు ఆర్థిక వృద్ధికి, జాతీయభద్రతకు ఎంతో అవసరం. అధునాతన తయారీ, ఇంధన వ్యవస్థలు, సాంకేతికత అభివృద్ధి తదితర రంగాల్లో ఈ ఖనిజాల వినియోగం కోసం ఇరుదేశాల మధ్య అతిత్వరలోనే ఒప్పందం కుదరనుంది' అని సెర్గియో గోర్ వెల్లడించారు. ఈసందర్భంగా భారత్, అమెరికాల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఏప్రిల్లో సంతకాలు జరగొచ్చని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో భారత తయారీ రంగాలకు 30 ట్రిలియన్ డాలర్ల మేర మార్కెట్ అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది.

# వ్యవసాయ సంస్థలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయండి

**హైదరాబాద్, మార్చి 13 (మనం బ్యూరో):** రాష్ట్రంలో ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్‌లో స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ సంఘాల ద్వారా కూరగాయలు, పూల సాగు చేయించి ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ చేయాలని ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రైతు వేదికలు, వ్యవసాయ మార్కెట్ గొడౌన్లు, వేర్ హౌసింగ్ గోదాములపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు.ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు మిగలడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖకు విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను విక్రయించుకునే అవకాశం, ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సంస్థలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు సంబంధించి రెడ్కో సంస్థను సంప్రదించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామనీ, ఈ అంశాన్ని రైతులకు చక్కగా వివరించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి అధికారులకు సూచించారు.

# ఆల్ ద బెస్ట్

**(మొదటి పేజీ తరువాయి)**

స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం అధికారులు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. మోడల్ క్వశ్చన్ పేపర్లు, జవాబు పత్రాల ఫార్మాట్ను బోర్డు అధికారిక వెబ్సైట్లో విద్యార్థులందరికీ అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. పరీక్షల ప్రారంభం సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రులు టెన్త్ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ.. శుభాకాంక్షలు తెలియజేశారు.

**హృదయ పూర్వక శుభాకాంక్షలు**

**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

పరీక్షలను తమ ప్రతిభను చూపించే మంచి అవకాశంగా భావించాలని.. ఒత్తిడిగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్టు శుక్రవారం గవర్నర్ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది.

**ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

తమ భవిష్యత్తుకు తొలిమెట్టుగా ఈ పరీక్షలను ప్రతి విద్యార్థి ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని కోరారు. భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని, మీలోని ప్రతిభను నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉజ్వలమైన భవిష్యత్తుకు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజలకు కావల్సినంత స్టాక్ ఉంది

**హైదరాబాద్, మార్చి 13 (మనం బ్యూరో):** రాష్ట్రంలో తగినంత గ్యాస్ నిల్వలు ఉన్నాయనీ, ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దనీ, బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదని పేర్కొన్నారు. ఇరాన్-అమెరికా యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరతపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎలాంటి కొరత లేదనీ, గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారంతో కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గందరగోళం ఏర్పడినందునే రోజు వారీగా 72 శాతం బుకింగ్స్ జరుగుతున్నాయనీ, అయితే, గృహ వినియోగదారులతో పాటు అసుపత్రులు, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.



రాష్ట్రంలో మొత్తం 810 ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందనీ, రాష్ట్రవ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్పిజి కనెక్షన్లు ఉండగా, ప్రతీ రోజూ 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని వివరించారు. గ్యాస్ సరఫరా, డిమాండ్, సప్లై వంటి అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో హైలెవల్ కమిటీఇప్పటి వరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదన్నారు. గ్యాస్ సరఫరాపై జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినందుకు ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విధంగా ప్రవర్తిస్తే మరిన్ని కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, పోలీస్ కమిషనర్లను ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# 17న సెకండ్ నేషనల్ మొబిలిటీ సమ్మిట్

**(మొదటి పేజీ తరువాయి)**

డేటా ఆధారిత ఫ్లీట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మెట్రో, బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర రవాణా విధానాలను కలిపే మల్టీ మోడల్ కనెక్టివిటీ అవసరాన్ని సమ్మిట్లో ప్రధానంగా చర్చించనున్నారు. సాంకేతికత, సస్టైనబుల్, సమగ్ర రవాణా విధానాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొబిలిటీ రంగంలో ముందంజలో నిలవడానికి ఉపయోగపడనుంది. ఈ సమ్మిట్‌లో కేంద్ర, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల రవాణా శాఖ అధికారులు, నగర అభివృద్ధి సంస్థలు, ఆటోమొబైల్, ఈవీ కంపెనీలు, టెక్నాలజీ సంస్థలు, స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, అకడమిక్ నిపుణులు పాల్గొంటారు.

# ఆర్టీసీ సమ్మె నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**

కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# మూసీ ఫ్రంట్‌ను వ్యతిరేకిస్తున్న వాళ్లు మూణ్ణెల్లు దానిపక్కనుండండి

**(మొదటి పేజీ తరువాయి)**

అభివృద్ధి చెందుతున్న దేశాలను అందుకోవాలనే మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు తలపెట్టామన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా మనం అభివృద్ధి చెందొద్దా ? బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాయని ప్రశ్నించారు. గుడ్డిగా వ్యతిరేకించడం సరైందేనా ? వ్యతిరేకించడం ఆపేయండి, అందరూ సలహాలు ఇవ్వండి. అందరూ సలహాలు ఇవ్వండి, అందరి సలహాలు, సూచనలు పరిగణనలోనికి తీసుకుంటాం. అందరినీ గౌరవిస్తాం. మనం ఎంత కాదనుకున్నా నిజాం నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నిజాం కట్టడాలు ఇప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. ఆ రోజుల్లోనే చార్మినార్ చుట్టూ ఎకనామిక్ జోన్‌గా చేశారు. నేను హిందువును. కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా. అలాగే, ఇతర మతాలను కూడా గౌరవిస్తానని వ్యాఖ్యానించారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో మనం నిర్మించిన అద్భుత కట్టడం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. నేను మంచికి ప్రతినిధిని అవుదామని అనుకుంటున్నా. అందుకే తెలంగాణ రాష్ట్రానికి రెండో సీఎం అయ్యే అవకాశాన్ని ప్రజలు తనకిచ్చారని వ్యాఖ్యానించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు. ఎవరినీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టదు. అందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే రూ.500 కోట్లు అని ప్రచారం చేస్తున్నారనీ, మూసీ పునరుజ్జీవాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లు అక్కడే ఉండండి, వంద మందైనా, రెండొందల మందైనా అకామిడేషన్ కల్పిస్తానని వ్యాఖ్యానించారు. మూసీ బ్యూటిఫికేషన్‌ను లూటిఫికేషన్ అని మాట్లాడుతున్నారనీ, గాంధీని చంపిన వాళ్లు కూడా ఇప్పుడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. గాంధీ అస్తికలు కన్యాకుమారిలో కలపడం ద్వారా ఫేమస్ అయిందనీ, బాపూ ఘాట్ కూడా అలాంటిదేనన్నారు. నిపుణులు, మేధావులతో చర్చించాకే నిర్ణయం తీసుకున్నామనీ, నల్గొండ గురించి ఒక్కరైనా ఆలోచించారా ? అని ప్రశ్నించారు. సహకరించే మనసు లేకున్నా ఓకే కానీ, అడ్డుకోవద్దని చెప్పారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో బీఆర్ఎస్ నేతలు నెలకు రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నారనీ, పేదలను కంటనీరు పెట్టకుండా పరిపాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. గాంధీని చంపినవాళ్లే ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారు, నేను హిందువుని కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా, అలాగే, ఇతర మతాలను కూడా గౌరవిస్తానని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో పది వేల కుటుంబాలు ఉన్నాయనీ, ఒక్కో కుటుంబానికి పునరావాసం కింద ఎంత ఇద్దామో చెప్పండి, ఇప్పటికే పది వేల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చామని వెల్లడించారు. అలా కాదు, ఈ ప్రాజెక్టును ఆపేద్దామని మీరంతా అంటే ఇప్పుడే ఆపేస్తానని స్పష్టం చేశారు. మేం పేదలకు మంచి చేస్తే మళ్లీ అధికారంలోకి రామని బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారనీ, అందుకే మూసీ పునరుజ్జీవానికి అడ్డుపడుతున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# అప్పుడు మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు

- **మహిళలకు 'నెలసరి' సెలవుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

**ఢిల్లీ, మార్చి 13 :** నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మనం అలాంటి చట్టాలు చేస్తే.. కంపెనీలు మహిళలను తీసుకోవని అభిప్రాయపడింది. ఆ సెలవుకు సంబంధించిన నియమాలను రూపొందించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిష్ను శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 'అలాంటి చట్టం తాము పురుషుల కంటే తక్కువ అనే భయం ఉద్యోగాలు చేసే మహిళల్లో సృష్టించే అవకాశం ఉంది. రుతుక్రమం అంశంపై అవగాహన కల్పించడం వేరు.. దానిని సెన్సేషన్ చేయడం వేరు. ఈ సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన మరుక్షణం ఎవరూ వారిని నియమించుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు' అంటూ పిటిషనర్ను ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషద్ తన వాదనలు వినిపించారు. 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవును మంజూరుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటు కంపెనీలు కూడా అలాంటి వెలుసుబాటును కల్పించాయని కోర్టు కు వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. అవన్నీ స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలన్నారు. ఆ సెలవును తప్పనిసరి చేస్తే.. మహిళల కెరీర్ ముగుస్తుందని మరోసారి ప్రస్తావించారు.మహిళల కెరీర్ను దృష్టిలోపెట్టుకొని గతంలో ఈ అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. నెలసరి సెలవులు ఇస్తే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలను ప్రోత్సహించినట్లవుతుంది. అయితే, వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీయొచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చు. అది మేం కోరుకోవట్లేదు. ఎందుకంటే మహిళల ప్రయోజనాల కోసం కొన్నిసార్లు మనం చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారొచ్చు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# సీఈసీ అభిశంసనకు విపక్షాల నోటీసులు

**ఢిల్లీ, మార్చి 13:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తులో అధికార భాజపాకు అనుకూలంగా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు లోక్ సభ, రాజ్యసభల్లో అభిశంసన తీర్మానం నోటీసులు అందజేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నోటీసులపై 130 మంది లోక్సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకాలు చేసినట్లు సమాచారం. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌పై విపక్షాలు ఇలా అభిశంసన నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. అయితే, సీఈసీ పక్షపాతంగా వ్యవహరించడం.. తదితర ఏడు అభియోగాలు మోపినట్లు తెలుస్తోంది.

# జిల్లాలో గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు



- గ్యాస్ సిలిండర్ల కొరతలేదు
- బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 13 మనంప్రతినిధిః జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని, వినియోగదారులు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, వృద్ధాశ్రమాలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత పేరుతో నిల్వలు దాచడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించరాదని, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రతిరోజు గ్యాస్ బుకింగ్లు, సరఫరా వివరాలను సేకరించి పూర్తి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ఎల్పి.జి డిస్ట్రిబ్యూటర్లకు ఏదైనా సమస్య ఎదురైతే స్థానిక ఎస్హెచ్ఓ లేదా 100 నంబర్కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా డొమెస్టిక్ లేదా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాలసరోజ, సహాయ పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, సంక్షేమ శాఖల అధికారులు అఖిలేష్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్ అంబదాస్, లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, ఎల్పి.జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సభ్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాల్లో సిలిండర్లకు ఎలాంటి కొరత ఉండబోదు

- గృహావసరాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు ఎల్.పి.జి సరఫరాలో లోటు రానివ్వం
- జిల్లాలో సాగు, తాగునీటి సమస్య లేకుండా చూస్తాం
- పంటలు చేతికి వచ్చే వరకు విద్యుత్, సాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 13 (మనం బ్యూరో): జిల్లాలోని గృహావసరాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేదని, అవసరమైన మేరకు సరఫరా చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఎల్.పి.జి సరఫరా, వ్యవసాయ పంటలకు సాగు నీరు, తాగు నీరు, విద్యుత్ కు సంబంధించి రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లాలో 250277 ఎల్పిజి కనెక్షన్లు ఉన్నాయన్నారు. గృహావసరాలకు వినియోగించే ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేదన్నారు.

గృహావసరాలకు, విద్యాలయాలకు, వైద్య ఆసుపత్రులకు ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎల్.పి.జి. 15 రోజులకు బదులు 25 రోజులకు సిలిండర్ బుక్ చేసుకునే విధంగా అవకాశం కల్పించడం జరిగిందే తప్ప ఎక్కడ సమస్య లేదని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 411002 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జవారి , వేరుశెనగ వివిధ రకాల పంట సాగు జరిగిందన్నారు. పంట సాగుకు కావలసిన సాగునీటి వినియోగానికి కావలసిన నీటి సరఫరా కి ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ లో 72.4928 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. రానున్న వేసవికాలంలో జిల్లాలో త్రాగునీటి సాగునీటికి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రబీ సీజన్ కు సంబంధించి త్వరలో కోతలు ప్రారంభం అవుతాయని అప్పటి వరకు సాగు నీటికి ఎక్కడ సమస్యలు లేవన్నారు. తాగు నీటికి సైతం సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి ముందస్తుగానే గోదాములు చూసుకోవడం, అవసరం మేరకు గన్ని బ్యాగులు సమకూర్చుకోవడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులకు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, ఇరిగేషన్ సి. ఈ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్ .ఈ పార్థసారథి, నీటిపారుదల శాఖ అధికారి మురళి, సివిల్ సప్లై అధికారి నరసింహారావు, వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, హార్టికల్చర్ అధికారి వెంకటేశ్వర్లు, బిపిఎల్ డిస్ట్రిబ్యూటర్ సచిన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో పాలు గ్రామాలకు 2. కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు

- సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి మార్చ్ 13 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి నియోజకవర్గం లోని వాళ్లు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ఎన్నార్ ఈజీఎస్ విధులు ద్వారా రూ.2 కోట్ల మంజూరు అయ్యాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు. మంజూరైన ఈ నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం పనులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వస తులు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు సంగారెడ్డి నియోజకవర్గంలో పలు గ్రామాల కు సీసీ రోడ్ల నిర్మాణం కోసం రెండు కోట్ల నిధులు మంజూరు చేయడంలో కృషిచేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పది పరీక్షలు రాసే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపిన డిఇఓ రమేష్ కుమార్

### నేటి నుంచి పది పరీక్షలు కొనసాగలున్నాయి

### పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 13 (మనం బ్యూరో)ః పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని డిఇఓ రమేష్ కుమార్ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరికీ పేరుపేరునా ఆల్ ద బెస్ట్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 60 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 4 మంది రూట్ ఆఫీసర్లు, 60 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 60 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, 20 మంది కస్టోడియన్స్, 4 (బృందాలు) ఫ్లయింగ్ స్క్వాడ్, 120 సిట్టింగ్ స్క్వాడ్, 519 మంది ఇన్విజిలేటర్లను నియమించాలని డిఇఓ రమేష్ కుమార్ తెలిపారు. శనివారం నుంచి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డిఇఓ పేర్కొంటున్నారు.

విద్యార్థులు హాల్టికెట్, ప్యాడ్, పెన్నులు తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. మీసేవ కేంద్రాలతో హాల్టికెట్ పొందవచ్చని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాలను సులువుగా తెలుసుకునేందుకు హాల్ టికెట్లపై క్యూర్ కోడ్ ను స్కాన్ చేసి కనుక్కోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఎక్కడ కూడా ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. పది పరీక్షలను పకడ్బందీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని సందర్భంగా డిఇఓ స్పష్టం వ్యక్తం చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల సెంటర్ దగ్గరికి చేరుకోవడంతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తమ వెంట తీసుకురాకూడదని ఆయన తెలిపారు. జిల్లాలో 6 ప్రభుత్వ, 122 జిల్లా పరిషత్తు, 20 కేజీబీవీలు, 1 ఎయిడెడ్, 2 తెలంగాణ మోడల్ స్కూల్స్, 7 టీజీ రెసిడెన్షియల్, 4 ఎంజెపీటీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్, 2 సోషల్ వెల్ఫేర్, 7 ట్రైబల్, 8 మైనార్టీ రెసిడెన్షియల్, 2 ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు ఉండగా, 66 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. 265 పాఠశాలలకు సంబంధించి 10658 మంది విద్యార్థులు, పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అందులో 5294 మంది బాలురు, 5364 మంది బాలికలు పరీక్షలకు హాజరుకానున్నట్లు డీఈవో వివరంగా తెలిపారు. 10 పరీక్ష రాసే ప్రతి విద్యార్థి హాజరు అయ్యి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

# బీఎన్ఆర్, ఎలైట్ ఇన్ఫ్రాలకు ఈడీ షాక్

- రూ. 35.05 కోట్ల ఆస్తుల సీజ్

హైదరాబాద్,మార్చి 13(మనం,ప్రత్యేకప్రతినిధి)ః నకిలీ పత్రాలతో బ్యాంక్ రుణాలు పొంది మోసాలకు పాల్పడిన బీఎన్ఆర్ ఇన్ఫ్రా, ఎలైట్ ఇన్ఫ్రా సంస్థలకు చెందిన ఆస్తులను హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఈడీ అధికారులు జప్తు చేశారు. ఈక్రమంలో రెండు సంస్థలు 35.05కోట్ల మోసాలకు పాల్పడ్డట్టు ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జప్తు చేసిన ఆస్తులు బీఎన్ఆర్ ఇన్ఫ్రా నిర్వహకులు బీరెడ్డి నరసింహారెడ్డి, కంఫార్ట్ సెక్యూరిటీ లిమిటెడ్ డైరెక్టర్ అనిల్ బెనిప్రసాద్ అగర్వాల్లకు చెందినట్లుగా తెలిపారు.ఈ సంస్థల కారణంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి సుమారు రూ.8.20 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ.26.86 కోట్లు నష్టం వాటిల్లిందని, మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఈడి అధికారులు వెల్లడించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా చూపెట్టడం, వివాదాస్పద భూములను బ్యాంక్ గ్యారెంటీలుగా సమర్పించినట్లు గుర్తించామన్నారు.

ఎస్బీఐ నుంచి రూ.1 కోటి విలువైన 'బ్యాంక్ గ్యారెంటీ'ని పొందే ఉద్దేశంతో, నిందితులకు కంఫర్ట్ సెక్యూరిటీ లిమిటెడ్ ( డైరెక్టర్ అనిల్ బెనిప్రసాద్ అగర్వాల్)కు మధ్య నకిలీ ఒప్పందం సృష్టించి మోసాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మోసపూరితంగా పొందిన రుణాలను దారి మళ్ళించి ఇతర ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

### ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ

# హెచ్జే దొర కన్నుమూత



హైదరాబాద్, మార్చి 13 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్జే దొర కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం నిమ్స్లో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు బాత్రూమ్ లోపడిపోయారు. కుటుంబ సభ్యులు మళ్లీ ఆయన్ను నిమ్సుకు తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో 1943లో హెచ్జే దొర జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎకనమిక్స్లో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన.. 1965లో ఐపీఎస్లో చేరారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ కెరీర్లో వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు, సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారా హింసను తగ్గించేందుకు విశేష కృషి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గానూ 'పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ' అవార్డు అందుకున్నారు.

డీజీపీగా పదవీ విరమణ చేసిన తర్వాత 2002న సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ గా నియమితులయ్యారు. దీనికి ముందు ఆయన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ గానూ సేవలందించారు. 'ఇంపాక్ట్ ఆఫ్ ట్రైనింగ్ ఆన్ ది పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఐపీఎస్ ఆఫీసర్స్', 'ఎన్టీఆర్తో నేను' అనే రెండు పుస్తకాలు రాశారు. అంతేకాకుండా 'జర్నీ థ్రూ ట్రబులెంట్ టైమ్స్' పేరిట ఆత్మకథ రాశారు.

# దొర మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, మార్చి 13 : ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ హెచ్.జె. దొర కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్గా, డీజీపీగా ఆయన సేవలను సీఎం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతో పాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారంటూ సీఎం ప్రశంసించారు.

# అలాంటి అధికారి 'దొర'కడు



- ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం
- దొర మృతి తీరని లోటుః కేసీఆర్

హైదరాబాద్,మార్చి 13(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః మాజీ డీజీపీ హెచ్.జె. దొర మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్, డీజీపీగా హెచ్జె దొర అందించిన సేవలను తెలుగు రాష్ట్రాల సీఎంలు గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతో పాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం హెచ్ జె దొర మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో పలు హోదాల్లో బాధ్యతలను చేపట్టి, వినూత్న సంస్కరణలు ప్రవేశపెట్టారని వారు గుర్తు చేశారు.పోలీస్ శాఖ అంటే కేవలం నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాదు, ప్రజలతో మమేకమై వారి నమ్మకాన్ని చూరగొన్నప్పుడే ఆ వ్యవస్థకు పరిపూర్ణత లభిస్తుందని నమ్మిన అధికారి దివంగత డిజిపి హెచ్.జె.దొర అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ప్రజా సంబంధాల విభాగం, పోలీస్ పి.ఆర్.ఓల వ్యవస్థ ఆయన దూరదృష్టికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోందని తెలిపారు. మాజీ డీజీపీ హెచ్జె దొర మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, పోలీస్ సంక్షేమ సంఘం నాయకులున్నారు.

# హెచ్జె దొర సేవలు మరులేం



- నిబద్ధత కలిగిన మార్గదర్శిని కోల్పోయాం
- క్రీడలలోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు
- మాజీ డీజీపీ దొర మృతి పట్ల డిజిపి బి. శివధర్ రెడ్డి సంతాపం

హైదరాబాద్,మార్చి 13, (మనం,ప్రత్యేక ప్రతినిధి)ః ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా విశేష సేవలందించిన ప్రతిభావంతుడైన ఐపిఎస్ అధికారి హెచ్.జె. దొర మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్ జే దొర గత కొంతకాలంగా నిమ్స్ లో చికిత్స పొందుతూ శుక్రవారం కన్ను మూశారు.

కిడ్నీ సంబంధిత వ్యాధి తో బాధ పడుతూ డయాలసిస్ చేయించు కుంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నిమ్స్ ఏఆర్సీయూ చికిత్స అందిస్తుండగా ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పోలీస్ శాఖ మరులేని సేవలందించిన హెచ్జె దొర ఒక నిబద్ధత కలిగిన మార్గదర్శి అని అలాంటి అధికారిని కోల్పోయామని శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. 1943లో శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన హెచ్. జె దొర 1965లో ఐపీఎస్ సాధించి పోలీసు శాఖలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని డీజీపీ గుర్తు చేశారు. హెచ్.జె. దొర డిజిపిగా ఉన్న సమయంలో పోలీసు శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సమీక్షించేందుకు 'రీట్రీట్' పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించేవారన్నారు. ఆ స్ఫూర్తితోనే దాదాపు రెండున్నర దశాబ్దాల విరామం తర్వాత ఈ నెల 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పోలీసు శాఖలో ఈ 'రీట్రీట్' కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించినట్లు శివధర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీన జరిగిన ఆ ప్రారంభ వేడుకలో హెచ్.జె. దొర స్వయంగా పాల్గొని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ తన సందేశాన్ని అందించారని, ఇంతలోనే ఆయన మరణ వార్త వినాల్సి రావడం అత్యంత విచారకరమని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ప్రజా సంబంధాల వ్యవస్థను ప్రారంభించడం వంటి వినూత్న కార్యక్రమాలను ఆయన చేపట్టారని డిజిపి కొనియాడారు.

**ఆదర్శవంతమైన ఐపీఎస్ :**

నల్గొండ జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో హెచ్.జె. దొర తనను ఒక పరిణితి చెందిన ఐపిఎస్ అధికారిగా అభివర్ణించారని, ఆ ప్రశంస తన జ్ఞాపకమని గత అనుభవాలను డీజీపీ శివధర్రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పదని, ఆయనకు వ్యక్తిగతంగా తనపై ఎంతో అభిమానం ఉండేదన్నారు. విధి నిర్వహణలో తనను ఎల్లప్పుడూ ప్రోత్సహించేవారని, ఆ చొరవతోనే ఆయన సొంత జిల్లా అయిన శ్రీకాకుళం ఎస్పీగా తనకు పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. పోలీసు శాఖలో హెచ్ . జె దొర ప్రవేశపెట్టిన విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని కొనియాడారు. సిబ్బంది సంక్షేమం కోసం ఆయన భద్రత, ఆరోగ్య భద్రత వంటి వినూత్న పథకాలను ప్రారంభించారని తెలిపారు. నాటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్ నక్సలైట్ల జననాట్య మండలికి దీటుగా పోలీసు కళాబృందాలను ఏర్పాటు చేసి, సాంస్కృతిక చైతన్యాన్ని తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

**నక్సల్స్కు ధీటుగా :**

ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజంపై పోరు అత్యంత కీలక దశలో ఉన్న సమయంలో పోలీసు బలగాల సామర్థ్యాన్ని పెంచడంపై హెచ్జె దొర ప్రత్యేక దృష్టి సారించారని డిజిపి శివధర్ రెడ్డి వివరించారు. నక్సలైట్లతో అంతిమ యుద్ధానికి ఆంధ్రప్రదేశ్ పోలీసులను సన్నద్ధం చేశారని, అందువల్లనే నక్సలైట్లు భారీగా నష్టపోయి 2009-10 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్ళి దండకారణ్యంలో తలదాచుకున్నారన్నారు.రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో ఆయన కృషి అమోఘమని, అందులో భాగంగానే జిల్లా శిక్షణా కేంద్రాలు (డిటిసిలు), కమిషనరేట్ శిక్షణా కేంద్రాలు (సిటిసిలు), బెటాలియన్ శిక్షణా కేంద్రాలు (బిటిసిలు) నెలకొల్పి శిక్షణ వ్యవస్థను పటిష్టం చేశారని గుర్తుచేశారు. కింది స్థాయి సిబ్బంది క్షేమం పట్ల ఎంతో తపన పడేవారని, యువ అధికారులకు మార్గదర్శిగా నిలుస్తూ వారిని ఎప్పుడూ వెన్నుతట్టి ప్రోత్సహించేవారని కొనియాడారు.

**క్రీడా రంగంలోనూ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ (1996-2002) హెచ్.జే. దొర ఇండియన్ ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరించి, భారత క్రీడాకారులను, ముఖ్యంగా వెయిట్ లిఫ్టర్లను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారని డీజీపీ తెలిపారు. ఆయన క్రీడా రంగానికి చేసిన సేవలు ఎనలేనివి. 2006 కామన్వెల్త్ గేమ్స్లో భారత బృందానికి చెఫ్-డి-మిషన్గా కూడా సేవలించారన్నారు. కూడా సేవలందించారు.

# మరో... జీఎస్టీ కుంభకోణం..

### నకిలీ ఇన్వాయిస్లతో రూ.84 కోట్ల కాజేత

### ఎస్కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్ అరెస్ట్..

హైదరాబాద్,మార్చి 13(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః రాష్ట్రంలో మరో భారీ జీఎస్టీ కుంభకోణం వెలుగుచూసింది. నకిలీ ఇన్వాయిస్లతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న వారి గుట్టును వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రట్టు చేశారు.వివరాల్లోకి వెళ్తే.. ఫేక్ ఇన్వాయిస్లు సృష్టించి, అసలు సరుకు సరఫరా చేయకుండానే దాదాపు రూ.84.15 కోట్ల మేర ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గుర్తించారు. ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్కేజీ ట్రేడింగ్ కంపెనీ యజమాని సందీప్ కుమార్ గోయల్ను అరెస్ట్ చేశారు.

**ఇలా జరిగింది :**

ఫేక్ ఇన్వాయిస్లతో సరుకు సరఫరా చేయకుండానే దాదాపు రూ.84.15 కోట్ల స్కాం జరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖకు ఉప్పందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు సందీప్ కుమార్ తన ఎస్కేజీ ట్రేడింగ్ కంపెనీ ద్వారా ఎలాంటి వస్తువులను విక్రయించకుండానే.. కేవలం కాగితాల మీద ఇన్వాయిసులు సృష్టించి కోట్లాది రూపాయల ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు తేలింది. కాగా సందీప్కుమార్ కేవలం ఒక్క కంపెనీకే పరిమితం కాకుండా.. హెచ్ఎఫ్సీ స్టీల్ ట్యూబ్స్ అండ్ వాల్వ్స్, విజయ్ ఇండస్ట్రియల్ నీడ్స్ ఎల్ఎల్పీ వంటి ఇతర సంస్థల పేర్లతో కూడా ఇదే తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు.

**జీఎస్టీ రిజిస్ట్రేషన్లు రద్దు :**

జీఎస్టీ పేరిట అక్రమాలకు పాల్పడిన రెండు సంస్థల జీఎస్టీ రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. నిందితుడు సందీప్ కుమార్పై తెలంగాణ జీఎస్టి చట్టం-2017 కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. కాగా ఎస్కేజీ ట్రేడింగ్ కంపెనీ లావాదేవీలపై మరింత లోతైన దర్యాప్తు జరుపుతున్నామని.. ఈ గొలుసుకట్టు మోసంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## జ్ఞాపకాల చొక్కా

నే దాచుకున్న చినిగిన జ్ఞాపకాల చొక్కా
పట్నం బస్సు స్టాండ్లో తప్పిపోయింది
ఆ పాత అంగీలోనే
నా నవ్వుల రాసులు పోగు చేసుకున్నా
అమ్మ చెమట వాసన
నాన్న చేతి కష్టపు ముద్ర
బాల్యపు గాలివాన
తడిసిన మట్టివాసన అందులోనే ఉన్నాయి
బాల్య దశలో
పచ్చని పైరులిచ్చే పిల్లగాలి
ఛాతిలో ధైర్యం నింపేది
బాటోంటే పోతుంటే
గ్రామ సింహం,ఆ కుక్కే అయినా
చూస్తూనే తోక ఊపి పలకరించేది
నాటి పక్షుల రాగాలకు
రోగం కూడా భయపడి పారిపోయేది
కోయిల కూతలకు
మనసు మళ్లీ పుట్టినట్టుండేది
కానిఇప్పుడు
పట్నంలో అందరూ మౌన వ్రతం చేసే చుట్టాలే
పక్షులేమో పన్ను కట్టలేక రాలేకున్నాయేమో!
వీసా లేక నగరంలోకి అడుగు
పెట్టలేకపోతున్నాయేమో!
రంగులతో మెరిసే భవంతులత
పోటీ పడలేక పచ్చని చెట్లు
నగరం నుంచి వలసపోయాయి
ఒకప్పుడు మట్టివీధుల్లో నా అడుగులు పూలై
పూశాయి
ఇక్కడ కాంక్రీట్ వీధుల్లో
అడుగులు కూడా ప్రతిధ్వనించవు
అప్పుడు చెరువు నీరు
ఆకాశాన్ని ఒడిలో పెట్టుకునేది
ఇప్పుడు గాజు భవంతులు
ఆకాశాన్ని బంధించుకున్నాయి
అక్కడి పొలాల్లోగాలి స్వేచ్ఛగా పరిగెత్తేది
ఇక్కడ గాలి కూడా ఏసీ గదుల్లో బందీ అయింది
పొలం గట్లపై కూర్చొని తిన్న జొన్న రొటె
రాజభోజనం లా అనిపించింది రాజభవనంలో
వేల రూపాయల విందులో ఆ రుచి కనిపించలేదు
పట్నం నాకులైట్లు ఇచ్చింది
రోడ్లు ఇచ్చింది
గాజు భవంతులు ఇచ్చింది
సౌకర్యాల మాయలో నన్ను ముంచింది కాని
నానుండి తీసుకుపోయింది మాత్రం
ఒక చెట్టు నీడ
ఒక చెరువు అల
ఒక కోయిల గానం

ఒక బాల్యం జ్ఞాపకాలు
పక్షుల స్వరాలు
ఓ పల్లె బంధాలు
నా బాల్యపు వెలుగు జాడలు
ఇప్పుడు నేను వెతుకుతున్నది
మట్టివాసన దాగి ఉన్న
ఆ చినిగిన జ్ఞాపకాల చొక్కా
ఎందుకంటే
ఆ చొక్కా దొరికితే
బట్టను కాదు బాల్యాన్ని ధరిస్తాను
ఆ బాల్యాన్ని దరిస్తేనే
నాలో ఇంకా బతికున్న
ఆ చిన్న పిల్లాడు
మళ్లీ నవ్వుతాడు

- దుప్పటి మొగిలి
8466827118

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# ప్రపంచీకరణతో మహిళలకు మేలు జరిగిందా?



గ్లోబలైజేషన్ అనే ఇంగ్లీషుమాటకు తెలుగులో ప్రపంచీకరణ అని చెప్పుకుంటున్నాం. 1991 లో సోవియట్ రష్యాలోని వామపక్ష ప్రభుత్వం పతనం కావడంతో అమెరికా అగ్రరాజ్యంగా నిలబడింది. ప్రపంచదేశాలు గాట్ ఒప్పందం మీద సంతకాలు చేశాయి. ఫలితంగా ఎల్‌పిజి వ్యవస్థ (లిబరలైజేషన్, ప్రైవటైజేషన్, గ్లోబలైజేషన్) అమలులోకి వచ్చింది. ఈ మార్పు సమాజంలో అనూహ్యమైన పరిణామాలను తీసుకొచ్చింది. సమాజంలో ఏ మార్పు వచ్చినా, దానికి చీకటి, వెలుగు కోణాలు రెండూ ఉంటాయి. ప్రపంచీకరణ పరిణామాలు కూడా అంతే. మహిళల దృష్టికోణం నుండి ప్రపంచీకరణను అర్థం చేసుకుందాం. ప్రపంచీకరణ భారతీయ మహిళలకు ఏమిచ్చింది? వెలుగునూ, చీకటినీ ఇచ్చింది.



ప్రపంచీకరణ ప్రవేశించి , భారతీయ మహిళల జీవితంలో పెనుమార్పులు తీసుకొచ్చింది. 1990ల నాటికి మహిళలు వంటిళ్ళను వదిలి అనేక సామాజిక రంగాలలోకి ప్రవేశిస్తూ ఉన్నారు. పురుషులతో నిండిన విద్యా, ఉద్యోగ, రాజకీయ, సేవా రంగాల్లోకి మహిళలు చొచ్చుకొని వస్తున్నారు. ప్రపంచీకరణ ప్రవేశించినాక మహిళలకు అంతకు ముందు లేని ఉపాధి రంగాలు అవతరించాయి. ఐటి , కార్పొరేట్ సెక్టార్ లు మహిళల కోసమే వచ్చాయన్నంతగా మేలు చేశాయి. భర్త ఆదాయం మీద ఆధారపడి బతికే మహిళల్ని, కుటుంబ ఆదాయం పెంచుకుని తమ పిల్లలకు మంచి చదువు చెప్పించాలనే తపన మహిళల్ని ఉద్యోగం రంగంలోకి తీసుకొని వచ్చింది. అయితే ప్రపంచీకరణ ప్రవేశించిన తర్వాత కేవలం కుటుంబ ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే గాక, మహిళలకు తమదైన స్వయం సమృద్ధ జీవితం ఉండేట్లు ఆర్థిక స్థితిని సృష్టించుకోవలసిన అవసరం ఏర్పడింది. దానిని ప్రపంచీకరణ నెరవేర్చింది. పురుషులతో సమానంగా, కొన్ని సందర్భాలలో పురుషులకన్నా అధికంగా మహిళలు సంపాదించే దశ వచ్చింది. అయితే ఈ మార్పు మహిళలందరికీ వచ్చేసిందని చెప్పలేము. ప్రపంచీకరణ ఒక పోటీని సృష్టించి, వెయ్యి మందిని ఆకర్షించి, వందమందిని పైకి లాగి తొంభై మందిని కిందికి నెట్టేస్తుంది. ఆర్థికంగా ప్రపంచీకరణ ప్రయోజనాలు సాధించడంలో పదిమంది మహిళలు విజయం సాధిస్తే, తొంభై మంది వీధిలో పడుతున్నారు. ఆ రకంగా ప్రపంచీకరణ మహిళల్లో రెండు వర్గాలను ఉత్పత్తి చేస్తున్నది.

మహిళలు అనేక సామాజిక రంగాలలోకి పురుషులతో పోటీ పడి రావడంతో, మహిళలు ఆర్థికంగా కొంత అభివృద్ధి చెంది ఉండవచ్చు. కానీ భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులు కావడం వలన తమ పిల్లల చదువు, ప్రవర్తనలమీద దృష్టి పెట్టలేక , వాళ్ళిద్దరి మధ్య సంఘర్షణలు ఉత్పన్నమవుతున్నాయి. అవి విడాకుల దాకా పోతున్నాయి. కుటుంబం దెబ్బ తింటున్నది. స్త్రీ ఉద్యోగ పరంగా ఇతర పురుష ఉద్యోగులతో బయటికి వెళితే, ఇంటికి రావడం ఆలస్యం అయితే రకరకాల అనుమానాలు భరించాల్సి వస్తున్నది. నిందలు మోయాల్సి వస్తున్నది. మహిళల ఆశలను, అవసరాలను ఆసరా చేసుకుని వాళ్ళను లైంగికంగా ఉపయోగించుకునే దుష్పరిణామాలు వస్తున్నాయి. అంతేకాదు సరైన రక్షణ లేని పరిస్థితిలో రాత్రివేళల్లో పని ముగించుకుని ఇళ్ళకు,ఊళ్ళకు క్షేమంగా చేరుకోలేక, అత్యాచారాలకూ, హత్యాచారాలకూ గురయ్యే సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. స్త్రీని సాటిమనిషిగా గుర్తించలేని వెనుకబాటు తనంలోంచి భారతీయ పురుష ప్రపంచం ఇంకా బయట పడనందువలన జరిగే అనర్థాలకు మహిళలు బలికావలసి వస్తున్నది. ఆపోజిట్ సెక్సుగా మాత్రమే మొగాళ్ళు ఆడవాళ్ళను చూసినంత కాలం ప్రపంచీకరణ కూడా వాళ్ళను కాపాడదు.

ప్రపంచీకరణ మనకు అందించిన గొప్ప సౌకర్యం సామాజిక మాధ్యమం. ప్రతి వ్యక్తీ తన భావాలను అభివ్యక్తం చేసుకోవడానికి వచ్చిన గొప్ప అవకాశం సామాజిక మాధ్యమం. ఇది మహిళలకు కూడా వాళ్ళ అంతరంగాలను ఆవిష్కరించుకోవడానికి గొప్ప సదుపాయం. నష్టపోయిన వారు, కష్టపడ్డవారు అవకాశాలను కోల్పోయిన వారు, విజయం సాధించినవారు, అనుభూతులు పొందినవారు వాటిని ఇతరుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడకుండా సమాజం దృష్టికి, పాలకుల దృష్టికీ తీసుకుపోవడానికి ఈ మాధ్యమం వేదిక అయింది. ఆత్మహత్య చేసుకునే మహిళ తానెందుకు ఆత్మహత్య చేసుకుంటున్నదో చెప్పుకుంటున్నది ఈమాధ్యమం ద్వారా. అదే సమయంలో ఆ సామాజిక మాధ్యమమే మహిళను ఘోరంగా అవమానిస్తున్నది, హింస పెడుతున్నది. ఆమె ప్రైవసీని దెబ్బ తీస్తున్నది. ఒక మహిళ తనకు జరిగిన అన్యాయాన్నో, అవమానాన్నో యూట్యూబ్‌లోనో దాడి మొదలు. ఫేసుబుక్‌లో వచ్చే సెక్స్ కథనాలు మానవసంస్కారాన్ని, ఘోరంగా అవమానిస్తున్నాయి. మహిళల మీద మూడేళ్ళ వాళ్ళు నుండి ముసలివాళ్ళదాకా అఘాయిత్యాలు జరుగుతున్నాయంటే సామాజిక మాధ్యమం పాత్ర ఉంది. సినిమాలు మహిళల శరీరాన్ని ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నాయి. ఇదంతా ప్రపంచీకరణ మాయాజాలమే. భూస్వామ్య వ్యవస్థ మహిళను పడకటింటి వస్తువుగా ప్రచారం చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థ మహిళను ఆటబొమ్మ గా మార్చింది. దాని పరిణిత రూపం ప్రపంచీకరణ మహిళను అంగడి సరుకుగా చేసింది. ప్రపంచీకరణ వలన మహిళ పొందిన ప్రయోజనం పిసరంత, పోగొట్టుకున్నది జీవితమంత.

- డాక్టర్ నల్లాని రాజేశ్వరి

# వంటగదిలో యుద్ధ మేఘాలు



దేశంలో సామాన్యుడి పరిస్థితి ఇప్పుడు 'పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు' తయారైంది. ఎప్పుడెప్పుడు తగ్గుతాయా అని ఎదురుచూస్తున్న వంట గ్యాస్ ధరలు, తగ్గకపోగా ఒక్కసారిగా భారీగా పెరగడం సగటు మనిషి నడ్డి విరుస్తోంది. గృహ వినియోగ సిలిండర్‌పై రూ. 60, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 115 పెరగడం అనేది కేవలం అంకెలు కావు.. అది ఒక పేదవాడి ఆకలి కేక, ఒక మధ్యతరగతి గృహిణి కన్నీటి వ్యథ. ఎక్కడో పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ కొట్టుకుంటే, మన వంటింట్లో మంట ఎందుకు పుడుతోంది..? భారత్ తన గ్యాస్ అవసరాల కోసం సగానికి పైగా ఇతర దేశాల మీద ఆధారపడుతోంది. అక్కడ యుద్ధ వాతావరణం ఉంటే, గ్యాస్ సరఫరా ఆగిపోతుందేమో అన్న భయంతో ప్రపంచ మార్కెట్లో ధరలు పెరుగుతాయి. దాంతో మన దేశంలోని చమురు సంస్థలు కూడా ధరలను పెంచేస్తాయి. గ్యాస్ సిలిండర్ ధర పెరగడాన్న సామాన్య విషయంగా చూడకూడదు. ఒక సిలిండర్ ధర పెరిగితే అది కేవలం గ్యాస్‌తోనే ఆగదు. హోటళ్లలో టిఫిన్ ధరలు పెరుగుతాయి, భోజనం ఖరీదవుతుంది. బయట దొరికే ఆహార పదార్థాల ధరలు పెరుగుతాయి. రవాణా, సూక్ష్మ పరిశ్రమల ఖర్చులు కూడా పెరుగుతాయి. ఇది పరోక్షంగా సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతుంది. దీంతో సామాన్యుడు తన పిల్లల చదువుకో లేదా ఆరోగ్యం కోసమో దాచుకున్న డబ్బును వంట గ్యాస్ కోసం ఖర్చు చేయాల్సి వస్తోందనేది గమనించాల్సిన వాస్తవం.



మన దేశంలో ఒకవైపు ఆర్థికవృద్ధి రేటుపై గణాంకాలు ఆశాజ టనకంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సగటు మనిషి తన ఆదాయంలో ప్రధాన భాగాన్ని కేవలం ఇంధనం, నిత్యావసరాలకే వెచ్చించాల్సి రావడం గమనార్హం. ఈ లెక్కన తాజా ధరల పెరుగుదల కేవలం ఆర్థిక అంశమే కాదు, అది సామాజిక సంక్షోభానికి దారితీసే అంశంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.

ఇక ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' కింద కోట్లాది మంది పేద మహిళలకు కనెక్షన్లు అందాయి. అయితే, ధర రూ. 900 దాటితే, ఆ కనెక్షన్లు కేవలం అలంకారప్రాయంగా మారే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మళ్లీ పొగచూరిన కట్టెల పొయ్యి వైపు మళ్లే పరిస్థితి పెరిగితే ఆరోగ్యపరంగా, పర్యావరణపరంగా వెనకడుగు వేయడమే అవుతుంది. సబ్సిడీలను కేవలం ఉజ్వల లబ్ధిదారులకే పరిమితం చేసినా, పెరిగిన ధరల నేపథ్యంలో వారు కూడా రీఫిల్లింగ్ భారాన్ని భరించలేకపోతున్నారు. ఉజ్వల లబ్ధిదారులకు ధరల్లో మార్పు లేదని చెబుతున్నప్పటికీ, గ్యాస్ రీఫిల్లింగ్ శాతం క్రమంగా తగ్గుతుండటం గమనార్హం. ప్రారంభంలో ఉచిత కనెక్షన్ ఇచ్చినా, పెరిగిన ధరల వల్ల రీఫిల్ చేయించుకోలేక మళ్లీ కట్టెల పొయ్యి వైపు మళ్లుతున్న గ్రామీణ మహిళల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది.

భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు 55% దిగుమతులపైనే ఆధారపడుతోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా నెమ్మదించడం వల్ల భవిష్యత్తులో స్టాక్ కొరత ఏర్పడవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో కొంతమంది డీలర్లు స్టాక్ హోర్డింగ్ (నిల్వ చేయడం) చేసే అవకాశం ఉంది. ఇది సామాన్య వినియోగదారుడికి సిలిండర్ బుక్ చేసినా సకాలంలో అందకుండా చేస్తోంది.

ఈ పరిస్థితులపై గ్యాస్ కొరతను అధిగమిస్తామని ప్రధాన మంత్రి హామీ ఇస్తున్నప్పటికీ ఆచరణ ఎలా ఉంటుందో చూడాల్సిన అంశం. ప్రభుత్వ ప్రతిపక్షాల వాదనలు చూస్తే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఇప్పుడు పశ్చిమాసియా సంక్షోభం వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు పెరిగాయని, ఇది మన ప్రభుత్వం చేతుల్లో లేని అంశమని, చమురు సంస్థలు నష్టాల్లో ఉన్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడాలంటే ధరల సర్దుబాటు తప్పదనే వాదనలు ఉన్నాయి.

ధరలు పెరిగినా 'ఉజ్వల' పథకం లబ్ధిదారులకు ప్రత్యేక సబ్సిడీ ద్వారా రక్షణ కల్పిస్తున్నామని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. అయితే ప్రతిపక్షాలు ఈ ధరల పెంపును 'నిరంకుశ నిర్ణయం'గా అభివర్ణిస్తూ అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు సామాన్యుడిపై భారం వేసే ప్రభుత్వం, ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నిస్తున్నాయి. గ్యాస్పై ఉన్న జీఎస్టీ ఇతర పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరలు వెయ్యి రూపాయలకు చేరువవుతుంటే 'ఉజ్వల' కనెక్షన్లు ఉండి ఏం లాభం..?

పేదవాడు సిలిండర్ నింపుకోలేక మళ్లీ కట్టెల పొయ్యి వాడుతున్నాడని విమర్శిస్తున్నాయి. చమురు కంపెనీల లాభాల కోసం సామాన్యుడిని బలి చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్షం వాదనలో నిజం ఉందనేది అర్థం చేసుకోవాలి. ఏదిఏమైనప్పటికీ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడమే రాజధర్మం. ఈ రాజధర్మాన్ని పాటించి పెరిగిన ధరల నుంచి ఉపశమనం కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నుల వాటాను తగ్గించాలి.

కంపెనీలు ఇష్టానుసారంగా ధరలు పెంచకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కేవలం అంతర్జాతీయ కారణాలను సాకుగా చూపకుండా, పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం లేదా పన్నులను హేతుబద్ధీకరించడం వంటి ధైర్యమైన నిర్ణయాలు తీసుకోవాలి. గ్యాస్ కొరత లేకుండా బఫర్ స్టాక్‌ను పెంచాలి.

ఆకాశమే హద్దుగా పెరుగుతున్న ధరల మధ్య సామాన్యుడు ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా మారుతున్న పరిస్థితుల్లో యుద్ధాలు ఎక్కడ జరిగినా, ఆర్థిక సంక్షోభాలు ఎక్కడున్నా.. వాటి ప్రభావం పేదవాడి పళ్లెం మీద పడకుండా చూడాల్సిన బాధ్యత పాలకులకుంది. పాలకుల నిర్ణయాలు వంటింట్లో మంటలను ఆర్పేలా ఉండాలి కానీ, సామాన్యుడి కడుపు కాల్చేలా ఉండకూడదు. గ్యాస్ మంటలు ఆరిపోవాలి.. పేదవాడి వంటింట్లో పొయ్యి వెలగాలి. అప్పుడే అది నిజమైన అభివృద్ధి అనిపించు కుంటుంది.

- రాజేందర్ దామెర (దారా)

# నదుల పరిరక్షణకు కాలుష్య నియంత్రణ అవసరం



ప్రతి సంవత్సరం మార్చి 14న నిర్వహించే నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నదులు, త్రాగునీటి వనరుల పరిరక్షణ ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. నదుల కాలుష్యం, ఆనకట్టల నిర్మాణం, జీవ వైవిధ్య నష్టం వంటి సమస్యలపై అవగాహన పెంచుతుంది. నదులను సంరక్షించడానికి, నీటి వనరులను స్థిరంగా ఉపయోగిం చడానికి ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాలని ఇది ప్రోత్సహిస్తుంది. మొత్తంగా, భవిష్యత్ తరాల కోసం నదులను పునరుద్ధరించి రక్షించ డానికి ప్రపంచ స్థాయి సహకారాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. 2026 సంవత్సరానికి నిర్ణయించిన సారాంశం నీరు మరియు లింగం. ఇది సురక్షితమైన త్రాగు నీరు, పారిశుధ్యం మానవ హక్కులుగా ఉండాలని, అలాగే లింగ సమానత్వాన్ని సాధించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలియ జేస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి ప్రకటించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు 5 మరియు 6 కూడా మద్దతు ఇస్తుంది.ప్రస్తుతం అధిక కాలుష్యం నదుల స్థిరత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పరిశ్రమల వ్యర్థాలు, మలినజలాలు, ప్లాస్టిక్, రసాయనాలు నీటిని కలుషితం చేయడం వల్ల నదులు తీవ్రంగా దెబ్బతింటు న్నాయి. దీనివల్ల జలచర మొక్కలు, జంతువులు నష్టపోయి జీవ వైవిధ్యం తగ్గుతుంది, సహజ పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుంది. కాలుష్యంతో కూడిన నదీ నీరు తాగితే అనేక వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలుగుతుంది. నీటిలో అధిక పోషకాలు చేరడం వల్ల యూట్రోఫికేషన్ అనే ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల ఆక్సిజన్ స్థాయి తగ్గి చేపలు, ఇతర జలజీవులు చనిపోతాయి. ప్రపంచంలో అనేక దేశాలు తీవ్రంగా కాలుష్యానికి గురైన నదుల సమస్యను ఎదుర్కొంటున్నాయి. భారతదేశం, ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో అత్యంత కాలుష్యంతో ఉన్న నదులు ఉన్నాయి. కొన్నిదేశాల్లో మాత్రం బలమైన పర్యావరణ చట్టాలు మరియు సమర్థవంతమైన నీటి నిర్వహణ వల్ల నదులు తక్కువగా కాలుష్యానికి గురవుతున్నాయి. కెనడా, నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, న్యూజిలాండ్ వంటి దేశాలు తక్కువ కాలుష్యంతో ఉన్న నదుల కోసం ప్రసిద్ధి చెందాయి.

ప్రపంచవ్యాప్తంగా నదుల కాలుష్యం గురించి అనేక అంతర్జాతీయ సంస్థలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసున్నాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం నివేదిక ప్రకారం ప్రతిరోజూ సుమారు 2 బిలియన్ టన్నుల మానవ వ్యర్థాలు నదులు, ఇతర నీటి వనరుల్లోకి విడుదల అవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి జలనివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే మలినజలాలలో 80% కంటే ఎక్కువ సరైన శుద్ధి లేకుండా నదులు సరస్సుల్లోకి వదిలివేయబడుతున్నాయి ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాల్లోఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం కలుషిత నీటి కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 1.8 మిలియన్ మంది మరణిస్తున్నారు. ఆహార వ్యవసాయ సంస్థ నివే టదిక ప్రకారం ప్రపంచంలోని త్రాగునీటి కాలుష్యంలో సుమారు 70% వరకు వ్యవసాయ రంగం కారణం అవుతోంది. ఎరువులు, పురుగుమందులు పశువుల వ్యర్థాలు నదుల్లో కలవడం వల్ల ఈ కాలుష్యం పెరుగుతోంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్‌మద్దతుతో చేసిన అధ్యయనాలు నదుల కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా తాగునీటి జీవ వైవిధ్యానికి ప్రధాన ప్రమాదాల్లో ఒకటని హెచ్చరిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు సమాచారం ప్రకారం నీటి కాలుష్యం కొన్ని ప్రాంతాల్లో ఆర్థికవృద్ధిని మూడో వంతు వరకు తగ్గిస్తుంది. ఎందుకంటే ఇది వ్యవసాయం, మత్స్యకార రంగం తాగు నీటి సరఫరాపై ప్రభావం చూపుతుంది. ఓషన్ కన్సర్వెన్సీ



చేసిన పరిశోధన ప్రకారం ప్రతి సంవత్సరం నదుల ద్వారా లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. దీనివల్ల సముద్ర కాలుష్యం మరింత పెరుగుతోంది. వరల్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ నివేదిక ప్రకారం 1970 నుంచి ఇప్పటి వరకు త్రాగునీటి జాతుల జనాభా 80% కంటే ఎక్కువగా తగ్గిపోయింది. దీనికి కాలుష్యం, నివాస ప్రదేశాల నాశనం మరియు ఆనకట్టల నిర్మాణం ప్రధాన కారణాలు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా శుద్ధి చేయని మలినజలాలు పరిశ్రమల వ్యర్థాల కారణంగా భారతదేశంలో 351 కంటే ఎక్కువ నది భాగాలు కాలుష్యానికి గురైనట్లు గుర్తించారు. ఉదాహరణకు ఎ్ఖఙఛ్ఝి ఖజీఠ్చిట లో ప్రతిరోజూ సుమారు 3 బిలియన్ లీటర్ల శుద్ధి చేయని మలినజలాలు చేరుతున్నాయి. జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకారం భారతదేశంలో ప్రతిరోజూ 70,000 మిలియన్ లీటర్లకు పైగా మలినజలాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో సగం మాత్రమే సరైన విధంగా శుద్ధి చేయబడుతున్నాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ చేసిన అధ్యయనాలు గృహ మలినజలాలు, పరిశ్రమల వ్యర్థాలు వ్యవసాయ రసాయనాలు నదుల కాలుష్యానికి ప్రధాన కారణాలని చూపిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం అనేక ప్రాంతాల్లో కలుషిత నీటి వల్ల నీటివల్ల వ్యాపించే వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. గంగా,యమునా,గోదావరి వంటి ప్రధాన నదులు పట్టణ ప్రాంతాల దగ్గర తీవ్ర కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్నాయి. యమునా నది ఢిల్లీలో తన మొత్తం పొడవులో కేవలం 2% మాత్రమే ప్రవహించినప్పటికీ, నగరంలోని సుమారు 70% మలిన జలాలను మోసుకుపోతుంది. నీతి ఆయోగ్ విడుదల చేసిన మిశ్రమ నీటి నిర్వహణ సూచిక ప్రకారం భారతదేశంలోని ఉపరితల నీటిలో సుమారు 70% వరకు కాలుష్యం ఉంది. కాలుష్యంతో నదులు పర్యాటకం, మత్స్యకార రంగం మరియు స్వచ్ఛమైన నీటిపై ఆధారపడే జీవనోపాధులను దెబ్బతీస్తాయి. తద్వారా ఆర్థిక నష్టాలు కలుగు టతాయి. మొత్తంగా, భారతదేశంలో నదుల కాలుష్యం ఆరోగ్యం, పర్యావరణం మరియు ఆర్థిక రంగాలపై తీవ్రమైన ప్రభావాలు చూపుతోంది.

నదుల కాలుష్యాన్ని తగ్గించి నీటి నాణ్యతను పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు ప్రారంభించాయి. ప్రారంభ కార్యక్రమాల్లో ఒకటైన గంగా యాక్షన్ ప్లాన్ 1985లో ప్రారంభించబడింది. తరువాత ప్రభుత్వం దేశంలోని ప్రధాన నదులను శుభ్ర పరచడానికి జాతీయ నదుల సంరక్షణ ప్రణాళికను ప్రవేశ పెట్టింది. 2014లో భారత ప్రభుత్వం నమామి గంగే కార్య క్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా మలినజల శుద్ధి వసతులు ఏర్పాటు చేయడం,ఉపరితలాన్ని శుభ్రపరచడం, జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలు చేపట్టబడ్డాయి. ఈ కార్యక్రమం కింద వందలాది ప్రాజెక్టులు ఆమోదించబడి నీటి నాణ్యతను మెరుగుపరచడం శుద్ధి చేయని మలినజలాలు నదుల్లోకి చేరకుండా నిరోధించడం జరుగుతోంది.

నదుల కాలుష్యాన్ని పర్యవేక్షిం చడానికి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తరచుగా నీటి నాణ్యతను అంచనా వేస్తూ దేశ వ్యాప్తంగా కాలుష్యానికి గురైన నది భాగాలను గుర్తిస్తుంది. గంగానది పునరుద్ధరణ ప్రాజెక్టు లను అమలు చేయడానికి గంగా నది శుభ్రత కోసం జాతీయ మిషన్ ప్రధాన సంస్థగా పనిచేస్తుంది. ప్రభుత్వం నీటి సం రక్షణ, వర్షపు నీటిసంరక్షణ, నీటి వనరుల పునరుద్ధరణ కోసం జల శక్తి అభియాన్ ను కూడా ప్రారంభించింది. అనేక రాష్ట్రాలు కూడా తమ స్థాయిలో నది పునరుద్ధరణ కార్యక్రమా లను చేపడుతున్నాయి. ఉదాహరణకు ఢిల్లీలో యమునా నది శుభ్రపరిచే ప్రయత్నాలు అహ్మదాబాద్‌లో సబర్మతి నది అభివృద్ధి కార్యక్రమాల్లో మలినజల శుద్ధి కేంద్రాలు నది తీరాభివృద్ధి చేపట్టబడ్డాయి.

ప్రభుత్వం మరిన్ని మలినజల శుద్ధి కేంద్రాలను నిర్మించి శుద్ధి చేయని మలినజలాలు నదుల్లోకి చేరకుండా చూడాలి. పర్యావరణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, నదీ తీర ప్రాంతాల్లో ఉన్న నగరాలు, పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, నది తీరాల్లో వృక్షారోపణ తడి మైదానాల పునరుద్ధరణను ప్రోత్సహించడం పండుగలు ఆచారాల్లో పర్యావరణహిత పద్ధతులను ప్రోత్సహించడం నది పరివాహక ప్రాంతాల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, కాలుష్యానికి కారణమైనవారిపై కఠినమైన శిక్షలు విధించడం ద్వారా పరిశ్రమల వ్యర్థాలను నియంత్రించాలి. రసాయన వ్యర్థాలను విడుదల చేసే పరిశ్రమలను కాలుష్య నియంత్రణ మండళ్లు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. స్థానిక సంస్థలు, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌరులు కలిసి పనిచేస్తే భారతదేశంలో నదుల కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి భవిష్యత్ తరాల కోసం స్వచ్ఛమైన నీటి వనరులను రక్షించవచ్చు.

(మార్చి 14-నదుల అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం)

- డా. పి.ఎస్. చారి
8309082823

# గ్యాస్ కొరత ప్రచారం అవాస్తవం

**ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దు**

**వినియోగదారులకుసరిపడా చేస్తాం**

**పౌర సరఫరాల శాఖఉత్తమ్ కుమార్‌రెడ్డి**





**మహబూబ్ నగర్, 13 మార్చి (మనం ప్రతినిధి):** అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని రాష్ట్ర సాగు నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విధంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. వి.సి.లో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,ఎస్.పి.డి.జానకి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ,పౌర సరఫరాల శాఖ,ఇరిగేషన్,వ్యవసాయ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

- **మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి లేఖ రాసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి**



**జగిత్యాల, మార్చి 13(మనం న్యూస్):** రాబోయే గోదావరి పుష్కరాలు-2027ను దృష్టిలో ఉంచుకుని నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతాల్లో ఉన్న ఘాట్ల వద్ద సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. నిజామాబాద్ మరియు జగిత్యాల జిల్లాల్లో గోదావరి తీరం వెంట ఉన్న ఘాట్లకు కోట్లాది భక్తులు వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా కందకుర్తి, పోచంపాడ్, తడపాకల్, వాల్గొండ వంటి ప్రధాన ఘాట్ల వద్ద భారీగా భక్తుల రద్దీ ఉండనున్నందున ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సదుపాయాలు, పోలీస్ భద్రత, సీసీ కెమెరాలు, వైద్య శిబిరాలు, అంబులెన్స్లు, అగ్నిమాపక సేవలు, విద్యుత్ సరఫరా, హైమాస్ట్ లైట్లు, ప్రత్యేక బస్సులు మరియు పార్కింగ్ ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. పుష్కరాల సమయంలో కోట్లాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేసి పనులను మిషన్ మోడ్లో పూర్తి చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం చేయుత



**జగిత్యాల, మార్చి 13(మనం న్యూస్):** జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్ లో జగిత్యాల పట్టణానికి చెందిన 4గురు గల్ఫ్ కార్మికులు గల్ఫ్ లో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున 20 లక్షల రూపాయల విలువగల ప్రొసీడింగ్ కాపీలను భాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది.ఉపాధి నిమిత్తం గల్ఫ్ కి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల పరిహారం చాలా గొప్ప కార్యక్రమం. ఏడు గల్ఫ్ దేశాలలో మరణించిన గల్ఫ్ కార్మికులు ఆరు నెలల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవడంతో ఐదు లక్షలు పరిహారం అందుతుందన్నారు. గత దశాబ్ద కాలం నుండి గల్ఫ్ సంఘాల, ఎన్ఆర్ఐ సంఘాలు ఎన్.ఆర్.ఐ పాలసి కోసం అనేక మార్లు వినతి సమర్పించారన్నారు. ముఖ్యమంత్రి గారు గల్ఫ్ కార్మికుల భాధలను అర్థం చేసుకొని 5 లక్షలు అందజేయటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా భరోసా ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ పేదింటి ఆడబిడ్డకు ముఖ్యమంత్రి అండగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,ఎమ్మార్వో రామ్మోహన్,సీనియర్ నాయకులు బాలే శంకర్, మహేశ్వర్ రావు, బాల ముకుందం , గడ్డం నారాయణ రెడ్డి,సర్పంచుల ఫోరమ్ కట్ట రాజేందర్, సర్పంచ్ లు గోడిసెల గంగాధర్,మహేష్,ప్రకాష్,జమున రాజేందర్, ములసపు మహేష్ ,సంగేపు మహేష్ , ఆనంద్ రెడ్డి, కౌన్సిలర్ లు పవిత్ర మహేష్,హరీష్, నాయకులు ఆరుముల్ల పవన్,రాజశేఖర్ రెడ్డి ,మహేందర్, రాజేశ్వర్ రెడ్డి ,శరత్ రావు, మల్లారెడ్డి,సురేందర్ రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం



**మహబూబ్ నగర్, 13మార్చి, (మనం ప్రతినిధి):** జడ్చర్ల పట్టణం బాదేపల్లి లో నూతనంగా నిర్మించిన జడ్చర్ల పురపాలక సంఘం కార్యాలయం భవనాన్ని శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జడ్చర్ల పురపాలక సంఘం కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్, మున్సిపల్ అధికారులకు, జడ్చర్ల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా అనేక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బి. ఆర్.యస్ పాలనలో రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలో నెట్టారని, ఆ అప్పులకు ప్రతి సంవత్సరం సుమారు రూ.75,000 కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటునప్పటికీ , ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లో ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా గత రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి నాణ్యమైన ఉచిత సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతులక్కు 2 లక్షల వరకు రుణమాఫీ, సన్న రకం వడ్లు పండించే రైతులకు క్వింటాల్కు 500 ప్రోత్సాహకం, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా ఇంకా అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉందని ఆయన అన్నారు.దానికి ప్రజల మద్దతు కావాలని అన్నారు. గత సర్పంచ ఎన్నికల్లో, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎన్నుకొని మరొక్కసారి వారి విశ్వాసాన్ని మా పార్టీ మీద చూపారు. అదే ప్రోత్సాహంతో మా ప్రభుత్వం గ్రామాలలో పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అందేలా చేయడానికి 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అట్టడుగు పేద ప్రజలకు సంక్షేమ మరియు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, పురపాలక సంఘం కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసినందుకు మంత్రి జూపల్లి కృష్ణా రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మున్సిపల్ ఛైర్పర్సన్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ ఛైర్పర్సన్ కోనేటి పుష్పలత మాట్లాడుతూ, మంత్రి జూపల్లి కృష్ణా రావు , ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తామని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇన్చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి, జడ్పి సీఈఓ వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మా రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రణాళికా బద్ధంగా చదివి ఉత్తీర్ణత సాధించాలి

- **జిల్లావిద్యాధికారి రాము**

**జగిత్యాల, మార్చి 13(మనం న్యూస్):** జిల్లా పరిషత్ సంగంపల్లె ఉన్న త పాఠశాలను జిల్లా విద్యాధికారి రాము ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ జాగ్రత్తగా, ప్రణాళికా ప్రకారంగా చదవాలని, చదివిన దాన్ని మననం చేసుకోవాలని, దాన్ని పరీక్షలో అర్థమయ్యే విధంగా మంచి హ్యాండ్ రైటింగ్ తో ఎగ్జామ్స్ రాయాలని సూచించారు. అలాగే విద్యార్థులు ఈ పరీక్షలు హాజరైనంతకాలము ఎలాంటి జంక్ ఫుడ్ తీసుకోకుండా మంచి ఆరోగ్యమైనటువంటి అలవాట్లను కలిగి, ఎలాంటి ఒత్తిడి లేకుండా చదువుకొని పరీక్షలు రాసి అందరూ కూడా 100% పాస్ కావాలనీ సూచించారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని జగిత్యాల జిల్లా తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా మంచి గుణాత్మకమైన ఫలితాలను సాధించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయుల అందర్నీ కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగాధర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ మరియు ఉపాధ్యాయులు రాజేష్, రవికుమార్, గంగాధర్, సతీష్, తిరుమల, ఫాతిమా, పోచయ్య లు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

- **మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలపై చలవ పందిర్లు ఏర్పాటు చేయాలి**
- **ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధం చేయాలి**
- **అంగన్వాడి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలి**
- **జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



**ములుగు, మార్చి 13, మనం ప్రతినిధి:** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలపై చలవ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆలయ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అంగన్వాడి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్.ఎస్ తాడ్వాయి మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను, 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పారిశుధ్య పనులను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతల గద్దెలపై చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆలయ రిలేయింగ్ ఫ్లోరింగ్ పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ గ్రామం లో మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో స్వయంగా భాగస్వామ్యం కావాలని గ్రామపంచాయతీ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని అన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు చేపట్టిన అందరూ గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరస్వామి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీధర్, ఆర్ అండ్ బి డి ఈ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు రోహిణి, ఊరట్టం గ్రామపంచాయతీ సర్పంచ్ కోరం శైలజ, వెంకటేష్ నాగమణి ప్రజాప్రతినిధులు, మేడారం ఆలయ గుత్తేదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండగ వరకు గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచనలు చేశారు.

## డిగ్రీ కళాశాల అడ్మిషన్ కరపత్రాలు ఆవిష్కరించిన

# మంత్రి శ్రీధర్ బాబు



**మహదేవపూర్, మార్చి 14మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహాదాపూర్ లో 2026 27 విద్యా సంవత్సరానికి గాను కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ వేముల రమేష్ గారి ఆధ్వర్యంలో అడ్మిషన్ కరపత్రాలను రాష్ట్రఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుమరియు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఇది చాలా శుభ పరిణామమని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పేర్కొన్నారు అదేవిధంగా రాష్ట్ర ఐటీ మంత్రివర్యులు 2008-2009 విద్యా సంవత్సరంలోమారుమూల మహాదేవపూర్ మండల కేంద్రంలో చుట్టూఉన్ననాలుగుమండలాలకు చెందిన బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సక్రమమైన విద్యను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి నూతన భవనానికి నిధులు మంజూరు చేశారని కళాశాల అభివృద్ధికి ఎల్లవేళలా సహాయసహకారాలుఅందిస్తున్నటువంటి మంత్రివర్యులు శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజు కళాశాలలో మిగిలి ఉన్న తరగతి గదుల నిర్మాణం, కళాశాల ప్రహరీ గోడ నిర్మాణమునకు నిధులు మంజూరు చేయించాలని వినతి పత్రం సమర్పించగా రాష్ట్ర ఐటీ మంత్రివర్యులు శ్రీధర్ బాబువెంటనే సానుకూలంగా స్పందించి కళాశాలలో ఫ్లోరింగ్, స్టోన్స్ మిగిలిన పెండింగ్ పనుల కోసం 15 లక్షల రూపాయలు మంజూరు చేయవలసిందిగా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పగా వారు కూడా హామీ ఇవ్వడం జరిగింది. అలాగే 2026 - 2027 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కళాశాల అడ్మిషన్ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు గ్రామ సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ జిల్లా అధికారులు ఐ క్యు ఏసి కో డాక్టర్ రాజు పోరిక, కళాశాల అధ్యాపకులు డాక్టర్ రజిత, కే మున్నయ్య, పరుశరాములు రవీందర్, రమ్యలు పాల్గొన్నారు.

# టెక్రియాల్ చెరువు వద్ద శానిటేషన్ పనులను పరిశీలించిన కలెక్టర్

- **ప్రజాప్రతినిధులు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి**



**కామారెడ్డి, మార్చి 13 ( మనంప్రతినిధి):** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. అనంతరం సదాశివనగర్ - కుప్రియల్ హైవే ఇరుపక్కల జరుగుతున్న పరిశుభ్రత పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. టెక్రియాల్ చెరువులో గణేష్, దుర్గాదేవి నిమజ్జనం జరిగిన ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శానిటేషన్ పనులు పూర్తి చేసి, ఈరోజు సాయంత్రం లోపు ఆ ప్రాంతాన్ని సమతలంగా చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని, ప్రజాప్రతినిధులు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, డీఎల్పీఓ శ్రీనివాస్, ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్ కొత్తపల్లి లలితతో పాటు పంచాయతీ, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్షయ బాధితులు వైద్య సేవలు వినియోగించుకోవాలి

- **జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్**



**జగిత్యాల, మార్చి 13(మనం న్యూస్):** క్షయ బాధితులకు సత్వర వైద్య సేవలు అందించాలని జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరిండెంట్ కృష్ణమూర్తి తో కలిసి క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అన్నారు...శుక్రవారం జగిత్యాల మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో టీబీ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాల వైద్య నిపుణులకు క్షయ బాధితులకు చేపడుతున్న సేవలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.. పల్మనాలజిస్ట్ డాక్టర్ సునీత దేవి డ్రగ్ రెసిస్టెన్స్ టీబీ గురించి వైద్యాధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డా.శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితులకు అందించాల్సిన ప్రత్యేక పరీక్షలు, వైద్యం, చేపట్టాల్సిన చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల గవర్నమెంట్ మెడికల్ కళాశాల విభాగాధిపతులు, వైద్యాధికారులు, డిపి పి ఎం హరీష్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, మహేష్, ఆంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్, సూపర్వైజర్ శ్రీనివాస్ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కేంద్ర మంత్రికి వినతి

- **స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి**




**కామారెడ్డి, మార్చి 13 ( మనం న్యూస్ ):** కామారెడ్డి పట్టణ కేంద్రంలో పారిశ్రామిక వాడ (ఇండస్ట్రియల్ కారిడార్) ఏర్పాటు చేయాలని కోరుతూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి దేశ రాజధాని న్యూ ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంతో పాటు 7 మండలాల్లో యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, విద్యావంతులైన యువతను భాగస్వామ్యం చేస్తే కామారెడ్డి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు సహా ఇతర విభాగాలతో సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఆధునిక సాగు పద్ధతుల వైపు రైతు చూపు

- సొంత పద్ధతుల్లో సాంకేతిక సాగు
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులే లక్ష్యం
- కూరగాయ పంటల సాగులో విస్తరిస్తున్న నూతన సాగు విధానాలు





**సిద్దిపేట, మార్చి 13, మనం ప్రతినిధిః** ప్రాచీన సాగు విధానాల స్థానాలకు స్వస్తి పలికి ఆధునిక సాగు విధానాల పై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉన్న వనరులను వినియోగించుకుంటూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఎక్కువ దిగుబడులను సాధించి మంచి లాభాలను పొందాలి అన్న లక్ష్యంతో సాగు పద్ధతుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కూరకాయ పంటల సాగులో నూతన పద్ధతులు అమలు చేస్తూ తక్కువ సమయంలో నాణ్యమైన మంచి దిగుబడును సాధిస్తూ లాభాలను పొందుతున్న రైతులను మిగతా రైతులు ఆదర్శంగా తీసుకొని ఆ వైపు అడుగులు వేస్తున్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రజల ఆహార అలవాట్లలో బాగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే కూరగాయల అవసరాలు బాగా పెరిగాయి. ఇందుకుగాను నాణ్యమైన మంచి ఆకారంలో ఉన్న కూరగాయలు పండించిన రైతుకు మంచి లాభాలు అంది రావడంతో ఆ సాగు విధానాలపై చిన్న సన్నకారు రైతు సైతం ఆసక్తి చూపడం గమనార్హం. గతంలో పదిరువై ఎకరాల పెద్ద రైతులకే అందుబాటులో ఉన్న పిలీహస్ , గ్రీన్ హౌస్, పందిరి, మల్చింగ్, పర్టిగేషన్, స్టిక్కింగ్, డ్రిప్, స్ప్రింక్లర్ లాంటి పద్ధతులు ఇప్పుడు అర ఎకరమున్న రైతుకు కూడా అందుబాటులోకి వచ్చింది. తనకున్న తక్కువ విస్తీర్ణంలో ఈ పద్ధతుల ద్వారా మంచి నాణ్యమైన పంటలను పండిస్తున్నారు.

**దిగుబడి, నాణ్యత పెంపు లక్ష్యం...**

నూతన సాగు విధానాల వల్ల నాణ్యమైన దిగుబడులు అందువస్తున్నాయి. ముఖ్యంగా పందిరి సాగు, స్టిక్కింగ్, మల్చింగ్, డ్రిప్ లాంటి విధాల వల్ల కూరగాయల సాగులో పెట్టుబడులు కలిసి రావడమే కాకుండా దిగుబడులు బాగా పెరుగుతున్నాయి. పైగా నాణ్యమైన మంచి ఆకారంలో ఉన్న దిగబడులు రావడంతో మార్కెట్లో మంచి ధర పలికి రైతుకు లాభదాయకంగా మారుతుంది. ఒకప్పుడు తీగజాతి పంటలకే పరిమితమైన పందిరి, మల్చింగ్ సాగు ఇప్పుడు చాలా పంటలకు విస్తరించింది. బీరా, కాకర, సొర, దొండ, పొట్ల, కీర పంటలతో పాటు బీర్నిస్, చిక్కుడు, టమాట, వంకాయ పంటల తో పాటు పలు రకాల కూరగాయ పంటలు మల్చింగ్, స్టిక్కింగ్, పందిరి సాగుతో మంచి దిగుబడులు పొందుతున్నారు.

**మార్కెట్లో మంచి గిరాకి...**

నూతన సాగు పద్ధతుల వల్ల కూరగాయ పైరు తొందరగా ఏపుగా పెరగడంతో పాటు మంచి సైజులో దిగుబడులు రావడంతో మార్కెట్లో మంచి ధర పలుకుతుంది. కూరగాయలకు మద్దతు ధర లేకపోవడంతో బాగా నాణ్యత కలిగిన రైతు కూరగాయలకే ముందు గిరాకీ ఉండడంతో అవే ఎక్కువ ధరకు అమ్ముడుపోతాయి. దీంతో ఆ రైతుకు ధర అధికంగా రావడంతో మంచు లాభం చేతికందుతుంది. ఈ పద్ధతుల ద్వారా సాగు ఖర్చులు కూడా కలిసి రావడంతో లాభాలు పెరుగుతున్నాయి.

# ఐరిష్ పబ్ సంస్కృతిని ప్రతిబింబించేలా ఐరిష్ ట్రయల్

## సరికొత్త వేడుకను ప్రారంభించిన రాయల్ ఛాలెంజ్




**వరంగల్, మార్చి 13 (మనంన్యూస్)ః** రాయల్ ఛాలెంజ్ తన సరికొత్త విస్కీ బ్లెండ్ ఐరిష్ ట్రయల్ను ఒక అద్భుతమైన బార్ అనుభవంతో ప్రారంభించింది. హైదరాబాద్ మాదాపూర్లో కాక్ అండ్ బుల్ వేదికగా ఐరిష్ పబ్ అనుభవానికి ప్రతీకగా నిలిచే స్నేహం, అనుబంధం, సంగీతం వంటి అంశాలను ఈ వేడుక ప్రతిబింబించింది. ఈ ప్రారంభ వేడుకలో ఐరిష్ ట్రయల్ను వివిధ రకాలుగా ప్రదర్శించారు. ఇంటరాక్టివ్ షోకేస్ జోన్లు, బ్రాండెడ్ పబ్ గేమ్లు నుండి లైవ్ ఐరిష్ సింగాలాంగ్ ప్రదర్శనలు, ప్రత్యేకమైన కాక్టెయిల్స్ వరకు అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. అతిథులు ఆవిష్కరణ క్షణాన్ని వీక్షించడమే కాకుండా ఐరిష్ కాఫీ, ఐరిష్ ఓల్ మెయిడ్, ఐరిష్ బక్, ఐరిష్ స్టోరర్, పికిల్ ట్రయల్ వంటి రకరకాల కాక్టెయిల్స్ను రుచి చూశారు. ఈ డ్రింక్స్ బ్లెండ్ వైవిధ్యతను, దానిలోని మృదుత్వాన్ని చాటిచెప్పాయి. రాయల్ ఛాలెంజ్ ఐరిష్ ట్రయల్ ప్రస్తుతం తెలంగాణలో మాత్రమే అందుబాటులో ఉంది. దీని ధరలు 750 మి.లీ కి 1360 రూపాయలు, 375 మి.లీ కి 680 రూపాయలు, 180 మి.లీ కి 340 రూపాయలుగా ఉన్నాయి.మరింత విస్తరిస్తోంది. డయాజియో ఇండియా( చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుచిరా జైట్లీ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'ప్రస్తుతం వినియోగదారులు మద్యం విషయంలో కొత్త రకమైన, అంతర్జాతీయ స్థాయి అనుభవాలను కోరుకుంటున్నారు. విస్కీ విభాగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అసలైన రుచి, మృదుత్వం, కొత్తదనం ఉండేలా చూసుకుంటున్నార'ని పేర్కొన్నారు. డయాజియో ఇండియా రాయల్ ఛాలెంజ్ ఐరిష్ ట్రయల్తో తన ప్రీమియం ఉత్పత్తులను అంతర్జాతీయ విస్కీ శైలులను భారతీయ వినియోగదారులకు పరిచయం చేస్తూనే, నేటి కాలపు వేడుకలకు తగినట్లుగా సులభంగా నచ్చే మృదువైన రుచిని ఇది అందిస్తోంది. భారతదేశంలో ఐరిష్ విస్కీని ఆస్వాదించే విధానంలో ఈ బ్లెండ్ ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది.

# జాగృతి అధ్యక్షురాలిని కలిసిన ఉద్యమకారులు



**బాన్సువాడ, మార్చి 13 ( మనం న్యూస్ )ః** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా బంజారా హిల్స్ నందినగర్ లోని స్వగృహంలో బాన్సువాడ మలి దశ ఉద్యమకారులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి చిత్ర పటం బహుమతి అందజేశారు. అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ., ఉద్యమకారుల హామీలను తీర్చేవరకు ఉద్యమకారులకు అండగా ఉంటానని, వారికి 250 గజాల ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, ఐడికార్డులు తదితర హామీలు అందజేసేవరకు ఉద్యమ కారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ గుప్త, జిల్లా మీడియా కన్వీనర్ దండు విజయ్ కుమార్, మండల అధ్యక్షులు గంజివారు చందు, చీదుర లీలాదర్, రాష్ట్ర నాయకులు శ్యామ అంజిరెడ్డి, మల్లూరి అనిల్ కుమార్ పలు ఉద్యమ సంఘాలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై విద్యార్థుల్లో అవగాహన



**చేవెళ్ల, మార్చి 13 (మనం న్యూస్):** మహిళల భద్రత, వేధింపుల నివారణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చెవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, జేబీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జేబీ ఫార్మసీ కళాశాఖల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేబీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ జాయింట్ సెక్రటరీ, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.జే. గాయత్రి దూరదృష్టి నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, వేధింపుల నివారణ, మహిళల రక్షణలో చట్ట అమలు సంస్థల పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. శ్యామ్ సుందర్ మాట్లాడుతూ షీ టీమ్స్ పనితీరు, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, వేధింపులు ఎదురైనప్పుడు ఎలా ఫిర్యాదు చేయాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అవసరమైనప్పుడు హెల్ప్లైన్లు మరియు ఫిర్యాదు వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, అనుమానాస్పద లేదా అనుచిత ప్రవర్తన గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



- సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్, మార్చి 13 ( మనం బ్యూరో )ః** లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చాలామంది ప్రజలు న్యాయ సంబంధిత సమస్యలను తేల్చుకోలేక ఇబ్బందులు పడుతుంటారని వారికి పరిష్కార మార్గం చూపిందుకే లోక్ అదాలత్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని సాయి చైతన్య పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు లోక్ అదాలత్‌లో పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు. దీనికి సంబంధించి పోలీస్‌శాఖ తరపున ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

# ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



**గజ్వేల్, మార్చి 13 మనం న్యూస్ః** రామాయణ రచయిత్రి, తొలి తెలుగు కవియిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని ఆమె విగ్రహానికి 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలుగు సాహితీ వనంలో మొల్లమాంబ అజరామరమైన ముద్ర వేశారని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ, తన ప్రతిభతో రామాయణాన్ని సరళమైన తెలుగులో అందించిన ఆమె స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా లోకానికి ఆమె ఒక మార్గదర్శి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షులు మోహన్నగారి రాజు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, చిట్కుల శివారెడ్డి, శేఖర్, కుమ్మర సంఘం నాయకులు, పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



**భీమదేవరపల్లి, మార్చి 13 మనం న్యూస్:** భీమదేవరపల్లి తాసిల్దార్ కార్యాలయం వీఆర్ఏలు నిరసన చేపట్టారు. వేముల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం తాసిల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యోగ పనిచేస్తున్న వేముల సతీష్ తెలిపిన వివరణ ప్రకారం హనుమకొండ ఆర్డిఓ కార్యాలయం నుండి వచ్చిన నోటీసులను వంగర గ్రామానికి చెందిన వార్డు సభ్యులు గజ్జల రమేష్ నివాసానికి వెళ్లి నోటీసులు అందించగా నోటీసులు తీసుకొని సంతకం పెట్టనని దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వంగరలో జరిగిన దాడి విషయాన్ని తాసిల్దార్ కు తెలుపగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దాడి చేసి వ్యక్తివి వెంటనే అరెస్ట్ చేయాలని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాల పనులకు డెడ్లైన్, లేకుంటే షోకేస్ మంత్రి

- మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం




**మహదేవపూర్, మార్చి13( మనం న్యూస్)ః** సరస్వతి అంత్య పుష్కరాలు మరియు రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టవలసిన ఏర్పాట్ల, డెడ్ లైన్ విధించుకొని, పనులు పూర్తి చేయాలి లేదంటే అధికారులకు షోకాష్ నూటీస్ జారీ చేయడం జరుగుతుందని, ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు, శుక్రవారం రోజు మహదేవపూర్ మండల పర్యటనలో భాగంగా, కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి, ఈవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, సమావేశానికి కొందరు ముఖ్య అధికారులు హాజరు కాకపోవడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మాకు ఏం పని లేదనుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయని అధికారులతో అడిగి తెలుసుకున్నారు మంత్రి. పుష్కరాల నిర్వహణకు అధికారులు, సమన్వయంతో మీ మొదటి వారం వరకు వేగం పెంచి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు మంత్రి. మౌలిక వసతుల విషయంలో పారిశుద్ధ్యం రహదారులు భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు, భక్తులకు సమాచార సాంకేతిక లోపం కలగకుండా ప్రత్యేక సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని సూచించారు, పంటలు పండని చెరువులను గుర్తించి, పార్కింగ్ మరియు బస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహదేవపూర్ పర్యటనలో భాగంగా, గిరిజన భవన్ లో కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమం, మహిళలకు బ్యాంక్ లింకేజీ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని



ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు, ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు రాయితీ వ్యవసాయ పనిముట్లను రైతులకు మంత్రి చేతుల మీదుగా అందించడం జరిగింది. మహిళలు కుట్టు మిషన్ల శిక్షణతో ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని సూచించారు, త్వరలో ఇతర మండలాల్లో గార్మెంట్ చిన్న ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు మంత్రి శ్రీధర్ బాబు. మరోవైపు మహదేవపూర్ ప్రాంతంలో అగర్బత్తుల తయారీ కు సంబంధించిన, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు, అలాగే రాజీవ్ యువశక్తి డైరీ ఉత్పత్తులపై కూడా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు, ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు మంత్రి. మంత్రి పర్యటనలో, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సంకీర్త్ గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి డి ఆర్ డి ఓ బాలకృష్ణ, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యుడు దండు రమేష్, మహదేవపూర్ సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్, పుష్కరాల సమీక్ష సమావేశంలో ధార్మిక సంస్థ సలహాదారులు గోవిందా హరి, అటవీ శాఖ అధికారి నవీన్ కాటారం సబ్ కలెక్టర్ మాయాన్ సింగ్ దేవాదాయ ఇరిగేషన్ విద్యుత్ పిఆర్ ఇరిగేషన్ మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడికి లోను కావద్దు



**గజ్వేల్, మార్చి 13 మనం న్యూస్ః** విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో వ్రాయాలని డాక్టర్ చైతన్య ఆనంద్ సూచించారు. ఈ సందర్భంగా పది పరీక్షలు రాయబోయే విద్యార్థులకు, తల్లిదండ్రులకు కీలక సలహాలు సూచనలు ఇచ్చారు. శనివారం నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని వైద్యులు డాక్టర్ చైతన్యాఆనంద్ సూచించారు. తల్లిదండ్రులు ర్యాంకులు, పర్సంటేజీల గురించి పదే పదే గుర్తు చేయకుండా, పిల్లలను ప్రోత్సహించాలని, చదువును కెరీర్కు తొలిమెట్టుగా గ్రహించేలా చూడాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలను సవాలుగా స్వీకరించి, భయం వీడి చదవాలని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని, సందేహాల నివృత్తికి సహకరించాలని సూచించారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

- పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేత



**పిట్లం, మార్చి 13 ( మనం న్యూస్ )ః** పిట్లం మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి ఆశలు కల్పించి, జుక్కల్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వకుండా మోసం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిజంగా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేసే దిశగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజంగా ఇల్లు అవసరమైన పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

**రంజాన్ తోఫా అందజేత**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ తోఫా అందజేస్తున్నారని, అందులో భాగంగానే పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు పరారు

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపిన పట్టణ సీఐ నరహరి



**కామారెడ్డి, మార్చి 13 ( మనం న్యూస్ )ః** కామారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలసదనం నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు మైనర్ బాలికలు పరారయ్యారు. ఇటీవల ప్రహరీ గోడను కూల్చి నూతనంగా నిర్మిస్తున్న నేపథ్యంలో గోడలో ఉన్న ఖాళీ మార్గం ద్వారా వారు బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాలసదనం సూపరిండెంట్ సంగమేశ్వరి తెలిపారు. పోలీసులు ఏసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సిఐ నరహరి ప్రకటనలో తెలిపారు. కాగా ఇటీవల కామారెడ్డిలో మిస్సింగ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. వారం రోజుల క్రితం గోసంగి కాలనీకి చెందిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యం కావడం పట్టణంలో కలకలం రేపుతోంది.

# ఖమ్మంలో మాంగళ్య షాపింగ్ మాల్

## ఘనంగా 30వ శాఖ ఘన ప్రారంభం • హాజరైన మంత్రి పొంగులేటి, సినీనటి శ్రీలీల





**ఖమ్మం, మార్చి 13(మనం న్యూస్):** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో ఖమ్మంలో 30వ శాఖను శుక్రవారం ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో దశాబ్దాల అనుభవం తో నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ మూడు రాష్ట్రాల ప్రజలకు విశేష సేవలందిస్తున్న మాంగళ్య యాజమాన్యం పిఎన్ మూర్తి, కాసం నమఃశివాయ బ్రదర్స్ కలిసి కృష్ణార్జునుల లాగా వ్యాపారం చేస్తున్నారని, త్వరలో తమిళనాడు రాష్ట్రంలో విస్తరించనున్నారని పేర్కొన్నారు, ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు.

ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ, ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందని పేర్కొన్నారు.

మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యమని తెలిపారు. మా స్వంత హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విశాల్, వరుణ్, కార్తిక్, అరుణ్, పనీత్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

**అందరికీ అందుబాటులో.....**

మాంగళ్య షాపింగ్ మాల్లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో ఖమ్మం జిల్లా ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు.

రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది.

**త్వరంలో తమిళనాడులో....**

ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 9-10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్గా నిలుస్తోంది. ఖమ్మం జిల్లా ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని యాజమాన్యం తెలిపింది,

# గెలువు మార్పుకు నాంది వలకాలి

- సమాజ వికాసం కోసం ప్రజా ప్రతినిధులు పనిచేయాలి
- శిక్షణా తరగతుల్లో ప్రొ. కోదండరామ్, హరగోపాల్





**పాల్వంచ, మార్చి 13(మనం న్యూస్):** ప్రజాస్వామిక పద్ధతుల్లో సాధించిన గెలుపు సమాజ మార్పుకు నాంధి వలకాలని ప్రొ. కోదండరామ్ అన్నారు. రాజ్యాంగానికి లోబడి జవాబుదారీ పాలనను అందిస్తూ.. ప్రజల హక్కులను రక్షించడంతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ పక్షాన గెలుపొందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉపసర్పంచుల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం శుక్రవారం పాల్వంచ సుగుణా గార్డెన్స్‌లో ప్రారంభమైంది. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో కోదండ రామ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు రాజకీయ దృక్పదంతో పాటు ప్రత్యేక లక్ష్యం ఉండాలని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పనితీరు ఉద్యమాన్ని నిలబెట్టాలని సూచించారు. ఒకప్పుడు ప్రజాప్రభుత్వాలు ఉండేవి కావని, దేవుని అనుగ్రహం ఉన్న వారు మాత్రమే పాలకులు అవుతారని నమ్మేవారని, కానీ రానురానూ వచ్చిన మార్పుతో దేవునితో సంబంధం లేని మానవతా వాదంతో ఒక వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదడం రామ్ తెలిపారు. మనల్ని మనమే పరిష్కారం కోసం పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదండరామ్ తెలిపారు. మనల్ని మనమే పరిపాలించుకునే విధానంతోపాటు అధికార మార్పిడి కూడా ప్రారంభమైందన్నారు. ఓట్లు వేసే అధికారం రావడం, అన్నింటికీ మించి సర్వజనీన వయోజన ఓటు హక్కుతో మార్పులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాజ్యాంగానికి లోబడి పాలన జవాబుదారీతనంతో కూడిందై ఉండాలన్నారు. కీలక నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఓ మంచిపాలన అందించొచ్చని ఆయన సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయన్నారు. 1992వ సం.లో వచ్చిన 73,74 రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థలకు కొత్త అధికారాలను తీసుకొచ్చిందని, నేరుగా నిధులు రావడంతో పాటు ఎన్నికల నిర్వహణ తప్పని సరైందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయితీల్లో వ్యత్యాసాలు లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మార్పు తథ్యమని, 1965వ సం. తర్వాత రైతాంగ ఉధ్యమాల ఫలితంగా ప్రశ్నించే తత్వం ప్రారంభమైందని, ఆదిపత్య దోరణి స్థానే, రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. స్థానికంగా ఎన్నికైన వారు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రధానంగా నిధుల వినియోగంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అటువంటి రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. నిధులు, విధుల కు చైతన్యం తోడైతేని సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.

**రాజకీయాలే సమన్యగా మారాయి : ప్రొ. హరగోపాల్**

రాజకీయమంటే సమాజ సమస్యలను అర్థం చేసుకుని వరిష్కరించడమని ప్రొఫెసర్ హరి గోపాల్ పేర్కొన్నారు. ఇప్పుడు రాజకీయమే ఒక సమస్యగా మారిందని ఆయన తెలిపారు. శిక్షణా తరగతుల్లో హర గోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడం నైతికత లోపించడం తదితర కారణాలతో రాజకీయాలు కలుషితమయ్యాయని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అధికారం అంటే సమాజం నుంచి పొందడం అని, అలాంటి అధికారాన్ని సమాజాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పుకు దోహదపడేలా కృషి జరగాలన్నారు. చైతన్యం ద్వారా మార్పు వస్తుందని, మార్క్స్ చెప్పినట్లుగా సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని ఆయన తెలిపారు. మానవసంబంధాల్లో మార్పులు త్వరిత గతిన సంభవిస్తున్నా యని, ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడంతో మానవ సంబంధాలు బలహీన పడి ఒక ప్రశ్నగా మారుతున్నాయన్నారు. ముందుగా మనిషి పరిపూర్ణ మానవునిగా ఎదగడమే గొప్ప మార్పు అని హరగోపాల్ స్పష్టం చేశారు. మనిషి సృష్టించిన సంపద సృష్టించిన వానికి దక్కడం లేదని, వేర్వేరు వ్యక్తుల వద్ద అది కేంద్రీకృతమవు తోందన్నారు. బలప్రయోగం రాజ్యాంగ లక్షణం అని తెలిపారు. ఈ సమాజం తల్లితండ్రి శిక్షించ లేక పోయినా రాజ్యాంగానికి శిక్షించే అధికారం ఇచ్చిందని ఆయన తెలిపారు. నమాజ మార్పు చైతన్యవంతమైన మనిషితో సమక్రమ మార్గంలో జరుగుతుందని హరగోపాల్ తెలిపారు. ఇప్పుడు స్వార్థమే మనిషిని నడుపుతోందని మానవ సంబంధాలు మానవీయంగా మారకపోతే మరింత ప్రమాదమన్నారు. కమ్యూనిస్టు ప్రతినిధుల ద్వారానే సమాజ మార్పు త్వరిత గతిన సాధ్యమవుతుందని హరగోపాల్ తెలిపారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ గౌరవాన్ని ఇనుమడింప జేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మౌళిక వసతుల కల్పన, ముఖ్యంగా విద్యా-వైద్యం, తాగునీరు తదితర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి ముందుకు సాగాలన్నారు. మున్ముందు కూడా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాలనే బాగుందనిపించేలా పాలన సాగాలన్నారు. ఈ శిక్షణ తరగతుల ను స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించగా.. సిపిఐ జాతీయ కార్యదర్శి డా కే నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెడవాడ వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రె బిక్షపతి, ప్రముఖ వైద్యులు సూర్యదేవర రామ్మోహన్ రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ తిప్పన సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి చివరి నాటికి లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- కామేపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి





**కామేపల్లి, మార్చి 13(మనం బ్యూరో):** మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కామేపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాస్తిపల్లి గ్రామంలో 3 కోట్ల 15 లక్షలతో జాస్తిపల్లి నుండి కెప్టెన్ బంజర రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, లాల్యతండ గ్రామంలో 3 కోట్ల 33 లక్షలతో లాల్యతండ ఆర్ అండ్ బి రోడ్డు నుండి జగన్నాథ తండ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఊటుకూరు గ్రామంలో ముత్యాలంపాడు గుడి నుండి శ్మశాన వాటిక వరకు కోటి 80 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, తాళ్ళగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి డోర్నకల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా టేకులతండ, పింజరిమడుగు, పాతలింగల మీదుగా 4 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించి, లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు వైఎస్సార్ హయాంలో కట్టించిన ఇందిరమ్మ ఇండ్లను అవహేళన చేస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు నిర్మిస్తామని హామి ఇచ్చి 2 పర్యాయాలు అధికారంలోకి వచ్చి ఇండ్లు కట్టకుండా మోసం చేశారని మంత్రి మండిపడ్డారు. ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్లు కూడా నిర్మించలేదని, తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. పేదింటి మహిళలు ఇబ్బంది పడవద్దని ప్రభుత్వం సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కోరిన రోడ్డు ఏప్రిల్ నెలలో మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఊటుకూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి ఇక్కడ ఉన్న విద్యుత్ సమస్య, ఇతర మౌళిక వసతుల సమస్యలు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# తెలంగాణా ఉద్యమకారులకు తీపి కబురు

- ప్రభుత్వ కమిటి నిర్ణయం పట్ల హర్షం
- కేసులతో పాటు ఉద్యమ చరిత్రను పరిగణనలోకి
- మీడియాతో ప్రొఫెసర్ కోదండరాం



**పాల్వంచ, మార్చి 13(మనం న్యూస్):** గత ప్రభుత్వ హయాంలో దగా పడ్డ తెలంగాణా ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో తీపి కబురు అందించబోతుందని తెలంగాణా జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ధీమా వ్యక్తం చేసారు. పాల్వంచలో సీపీఐ శిక్షణ తరగతులకు విచ్చేసిన కోదడరాం కేటీపీయస్ అతిథి గృహంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చుటకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టిందనారు. త్వరలో కమిటి వేయబోతున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. అసలైన ఉద్యమకారులను గుర్తించి, సంక్షేమం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని తెలిపారు. గత ప్రభుత్వం గుర్తించలేని ఉద్యమకారులను ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన న్యాయం చేస్తారన్నారు. ఉద్యమకారులుగా గుర్తించుటకు కేసులతో పాటు ఉద్యమ చరిత్రను పరిగణలోనికి తీసుకుంటారని గుర్తుచేసారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో టీజేయస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం, రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం, షేక్ నబీ సాహెబ్ లు వున్నారు.

# రంజాన్ తోఫా పంపిణి చేసిన ఎమ్మెల్యే



**దమ్మపేట, మార్చి 13 (మనం న్యూస్) :** దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను ఎంఎల్ఏ జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. స్థానిక షాదీ ఖానా పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామ్ నరేష్, ఏఎంసి చైర్మన్ వాసం రాణి, శ్రీనివాస రావు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, అత్తులూరి వెంకట్రామా రావు, చిన్నంశెట్టి యుగంధర్, రెవెన్యూ అధికారులు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలి

- ఖమ్మంలో పెన్షనర్ల ప్రదర్శన, ధర్నా





**ఖమ్మం, మార్చి 13(మనం న్యూస్):** భారత ప్రభుత్వం యుద్ధ నివారణ చర్యలు చేపట్టి నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని డిమాండ్ చేస్తూ వందలాది పెన్షనర్లు నగరంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, మానవహననాన్ని ఆపాలి, పర్యావరణాన్ని కాపాడాలంటూ పెన్షనర్లు ప్లకార్డులు చేతపట్టి వైరా రోడ్ లోని పెన్షనర్స్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సుబ్బయ్య టి.వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వకుండా గత రెండు సంవత్సరాల నుండి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సమయంలో యుద్ధాన్ని ఆసరాగా చూపి నిత్యవసర వస్తువుల ధరలను పెంచడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వం తక్షణమే యుద్ధ నివారణ కు పూనుకోవాలని తద్వారా నిత్యవసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఏకపక్షంగా ఇరాన్ పై దాడులు నిర్వహించడంతో దాని ప్రభావం భారతదేశంలో పడుతున్నదని బడి పిల్లలు అని చూడకుండా పాఠశాలల మీద బాంబులు వేయటం న్యాయం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆర్ వెంకట్ నారాయణ ఉపాధ్యక్షులు ఎస్ పూర్ణచంద్రరావు కార్యదర్శి టి జనార్దన్ పి జానయ్య సీనియర్ నాయకులు సి బాబురావు తో పాటు ఖమ్మం నగర శాఖ నాయకులు పి బసవరావు ఆర్ రాధాకృష్ణ దొడ్డ రమేష్ జి ఆదినారాయణ నాగేశ్వరరావు సిహెచ్ బాబు సత్యనారాయణ వెంకటపతి రాజు ఆంజనేయులు పని రాజ్ కుమార్ గోవిందు మోహన్ దాస్ వెంకటేశ్వర్లు భాస్కర్ రెడ్డి గురవయ్య సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

## విగ్రహావిష్కరణ చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**దమ్మపేట, మార్చి 13 (మనం న్యూస్):** దమ్మపేట మండలం మల్కారం గ్రామంలో తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన మహాకవయిత్రి మొల్ల మాంబ జయంతి సందర్భంగా ఆమె విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా తెలుగులో రచించి ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించిన గొప్ప కవయిత్రి మొల్ల మాంబ అని అన్నారు. కులం స్థితిగతులు అనే అడ్డంకులు ఉన్న కాలంలో కూడా తన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహానుభావురాలని తెలిపారు. ఆమె రచించిన మొల్ల రామాయణం ఇప్పటికీ ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. ఇలాంటి మహనీయుల జయంతులను జరుపుకోవడం ద్వారా నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు



మల్కారం గ్రామంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులను ప్రత్యక్ష అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సున్నం రుక్మిణి, ఉపసర్పంచ్ బాలు, శ్రీరాముల ప్రసాద్, గుత్తా రాజా, సిగ్గం వెంకటేశ్వరరావు, బుద్దే కోటేశ్వరరావు, దరిపల్లి వెంకటనారాయణ, సల్మాన్ రాజు, నూతలపాటి ఏసుబాబు, నూతలపాటి నరసయ్యా, కపిలేశ్వరపు బాలాజీ, మోతుకూరి రామ దుర్గారావు, శివ కుమార్, రామకృష్ణ, శంకర్ రావు, శ్రీనివాస రావు, కమలాకర్, కిషోర్, వెంకట్రావ, రమేష్ , కృష్ణ,రాము తదితరులు పాల్గొన్నారు.

మనం Manam



# నిరుద్యోగుల ఉపాధి కల్పనకు టాస్క్ ఎంతో దోహదం

- రాష్ట్ర టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి
- టాస్క్ సెంటర్ ఏర్పాటుకై కల్వకుర్తిలో భవనాల పరిశీలన



కల్వకుర్తి మార్చి13(మనం న్యూస్): కల్వకుర్తి ప్రాంత నిరుద్యోగ విద్యావంతులకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు టాస్క్ సెంటర్ ఎంతో దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.కల్వకుర్తి పట్టణంలో టాస్క్ సెంటర్ ఏర్పాటు కోసం శుక్రవారం టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,టాస్క్ రీజనల్ హెడ్ నవీన్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జీ రవికిరణ్,బృందం సభ్యులతో పాటు కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచులు బృంగి ఆనంద్ కుమార్, పసుల సుదర్శన్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు పలు భవనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరం టాస్క్ సెంటర్ నిర్వహణకు సరిపోతుందని వారు సూత్రప్రాయంగా నిర్ణయించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టాస్క్ సెంటర్ నిర్వహించేందుకు అనుమతివ్వాలని కల్వకుర్తి ఎంపిడీఓ వెంకట్రాములుకు టాస్క్ రీజనల్ హెడ్ లెటర్ అందజేశారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో కల్వకుర్తి పట్టణంలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచులు బృంగి ఆనంద్ కుమార్,పసుల సుదర్శన్ రెడ్డి,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,లు పేర్కొన్నారు. అనంతరం టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి టాస్క్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 16 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో 17వ సెంటర్ ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఐటి,ప్రొఫెషనల్ కోర్సులు,డిగ్రీ పూర్తి చేసిన వారికి టాస్క్ సెంటర్లో మెలకువలు, నైపుణ్యం సాధించడంతో పాటు ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు శిక్షణ ఇస్తారని తెలిపారు.టాస్క్ సెంటర్ ఏర్పాటైన తర్వాత మొదటి బ్యాచ్లో 40 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,ఐటి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే టాస్క్ సెంటర్ల ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ విద్యావంతులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ,ఉపాధి రంగంలో నిలదొక్కుని వారు రాణించేందుకు టాస్క్ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టాస్క్ ఆర్ఓ సమీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు హన్మనాయక్, మబ్బు రామరాజు,మాజీ కౌన్సిలర్లు గోరటి శ్రీను, నాయకులు గోపిరెడ్డి చిన్న రాంరెడ్డి,బాల్ రెడ్డి,దామోదర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చిలుక ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



- ముఖ్యఅతిథిగా హాజరైన దేప భాస్కర్ రెడ్డి

రంగారెడ్డి మార్చి 13 (మనం న్యూస్): మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ కు చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వాసవి కాలనీ లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు , పారిశుద్ధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలుక ఉపేందర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు అని కొనియాడారు.= యువతను ఏకం చేయడంలో ఆయన పాత్ర ప్రశంసనీయం అని,రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాను.పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా ఆయన సేవలు మహేశ్వరం నియోజకవర్గానికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రావు, రమేష్ నేత, సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్,బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్, శేఖర్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్, రామారావు, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, పెద్ద వూర సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ లేనిదే మానవ మనుగడ లేదు

- సమాజ అభివృద్ధిలో మహిళ పాత్ర మరువలేనిది
- కాచం సుష్మ



రంగారెడ్డి మార్చి 13 (మనం న్యూస్): సమాజ అభివృద్ధిలో మహిళా పాత్ర మరువలేనిదని, మహిళలేనిదే మానవ మనుగడ లేదు అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ అన్నారు. శుక్రవారం చైతన్యపురి న్యూ మారుతి నగర్ మహిళా భవన్ లోఅంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, ఇష్ట లేడీస్ కిట్టి గ్రూప్ మొదటి నెల సమావేశమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. తేజస్వి రావు, డా. మౌనిక, డా. శ్రావణి రెడ్డి, డా. భవాని రెడ్డి, డా. చైతన్య లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాచం సుష్మ మాట్లాడుతూ మహిళలకు అవకాశం ఇస్తే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేస్తారని అన్నారు. ఒక మహిళ చదువుకుంటే ఒక తరం ముందుకు వెళుతుందని, ఏ రంగంలోనైనా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడమే నిజమైన సమాజాభివృద్ధి అని అన్నారు. మహిళ సాధికారత సంక్షేమం కేవలం నినాదంగా కాకుండా దేశ అభివృద్ధికి పునాది వేసే లాగా ఉండాలని అన్నారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి శిరీష, వి విజయలక్ష్మి, పద్మావతి, కే లక్ష్మి, సుజాత, సత్యలక్ష్మి, సులోచన, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువు

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



రంగారెడ్డి మార్చి 13 (మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని, ఫోర్త్ సిటీ అని గొప్పలు చెప్పుకుంటూ ఉన్న సిటీని ఆగం చేస్తున్నారని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు,హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంట చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్క ఆకును పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ ఉన్న వాకర్స్ మాట్లాడుతూ ఇక్కడికి వాకింగ్ రావాలంటే దోమల వల్ల మాకు ఎక్కడ విషరోగాలు వస్తాయో అని బయపడుతున్నామని అన్నారు. దోమల ప్రభావం వల్ల చాలామంది ఉదయం, సాయంత్రం పూట వాకింగ్ రావడానికి జంకుతున్నారు అని అన్నారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత భారస ప్రభుత్వంలో ప్రజ సమస్యల మీద ఎంతో చిత్తశుద్ధితో ముందుచూపుతో ఆలోచించి నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పేరుకొనిపోకుండా కాలనీవాసుల సౌలభ్యం కోసం దోమల నివారణకు డ్రోన్స్ సహాయంతో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించి సఫలీకృతం కావడం జరిగింది. చెరువుల్లో దోమల వల్ల ఉత్పన్నం అయ్యే లార్వాను అరికట్టడానికి వేలాది గంబూజియా జాతికి చెందిన చేప పిల్లలను చెరువులోకి వదలడం వల్ల అవి లార్వాను మింగేయడం జరిగింది.తద్వారా దోమల వ్యాప్తి అరికట్టడం జరిగింది.అలాగే డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగించి చెరువు మధ్యలోకి వెళ్లడం సాధ్యం కాని చోట్ల కూడా దోమల నివారణకు మందులు చల్లడం జరిగింది అని గుర్తు చేశారు.కానీ ప్రస్తుతం ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాల మీద దృష్టి పెట్టకుండా చెరువుల్లో పెరుకుపోతున్న గుఱ్ఱపుడెక్క ఆకును తొలగించకుండా నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తుంది.ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్న హులుకులేదు పలుకులేదని అన్నారు.కొందరు కాంగ్రెసు నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ తమ పబ్బం గడుపుతున్నారు అని విమర్శించారు. జంటనగరాల అభివృద్ధి గాలికి వదిలారని అన్నారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సమస్యల మీద దృష్టి సారించాలని కోరుతున్నాము.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి,సామ తిరుమల రెడ్డి,చెన్నగొని శ్రీధర్ గౌడ్,జగదీష్, నాగరాజు,జక్కిడి రఘువీర్ రెడ్డి,భాస్కర్ సాగర్,గోరిగే ప్రదీప్ పాల్గొన్నారు.

# పోలీసులను నమ్మే పరిస్థితి లేదు?

- తెలంగాణలో దిగజారిన శాంతిభద్రతలు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా టెక్ కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘువాల్లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు. రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

# మార్చి 17 న జరిగే మహాధర్నాను విజయవంతం చేద్దాం




- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్

రంగారెడ్డి, మార్చి 13 (మనం న్యూస్)ః కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లేషన్ లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఇందిరా పార్క్ వద్ద మార్చి17 న నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేద్దామని క్షవర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్కె పుర డివిజన్ లో మహాధర్న పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ క్షవర వృత్తిదారులకు 2025 -26 సంవత్సరానికి వృత్తి దారులకు కేటాయించబడిన బడ్జెట్ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. రాజీవ శక్తి ఎంపికైన సుమారు 13 వేల మంది చేతివృత్తిదారులకు నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వివరిస్తున్నారు అన్నారు. చేతి వృత్తిదారులకు కేటాయించిన 100 కోట్ల బడ్జెట్ మార్చి 31 లో విడుదల చేయాలి అని డిమాండ్ చేస్తూ మార్చి 17వ ఇంద్ర పార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నాము అని అన్నారు . ఆర్కేపురం డిజైన్స్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ , గౌరవ అధ్యక్షులు ఆమంచి అంజయ్య, డివిజన్ నాయకులు రవి ,నందు ,పరమేష్, జైపాల్, శంకర్ తదితరులు హాజరైనారు.

# రాములు మృతదేహానికి నివాళులు



(రంగారెడ్డి మనం న్యూస్)ః ఇబ్రహీంపట్నం మాజీ శాసనసభ్యులు కొండగారి రాములు పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ,సిపిఐ రాష్ట్ర నాయకులకు పుస్తకాల నర్సింగ్ రావు , సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దత్తు నాయక్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్ ,ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్,ఏసీ పి కేపీవి రాజుగారు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మాటలొద్దు?.. క్షేత్రస్థాయిలో చర్యలు చెపట్టండి

- వంట గ్యాస్పై ఆందోళన...
- ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి?
- కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, మనం ప్రతినిధి : పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, ఎల్పీజీ సిలిండర్ల కొరతపై వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు. గృహ అవసరాల కోసం ఎల్పీజీ సిలిండర్ల కొరతను సమన్వయంతో పునరుద్ధరించాలని కోరారు. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు ఎదురొంటున్న సంక్షోభ నివారణకు తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ సరఫరాను పునరుద్ధరించకపోతే హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని రాష్ట్రంలోని హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. గ్యాస్ కొరత కారణంగా హైదరాబాద్లోని ఐటీ కారిడార్ పీజీ హాస్టళ్లలో నివసించే లక్షలాది మంది విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్కు భోజనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

గ్యాస్ లభ్యతపై ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందుకోసం జిల్లాస్థాయి పంపిణీ వివరాలతో కూడిన పబ్లిక్ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలన్నారు. గృహ అవసరాల కోసం రావాల్సిన సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆ లేఖలో కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. హోటల్ రంగంపై 80 లక్షలమంది దినసరి కూలీలు ఆధారపడి బతుకుతున్నారని, వారికి ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా తక్షణమే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# నాణ్యమైన ఉపాధి విద్య అవసరమే : ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకృష్ణారెడ్డి

- తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రగామి : ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రం
- ఏప్రిల్ 14న 'డిజిటల్ సాధికారత' దినోత్సవం : వీ.సీ ప్రొ. ఘంటా చక్రపాణి




హైదరాబాద్, మనం ప్రతినిధి : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి నాణ్యమైన, సమ్మిళిత విద్యను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విద్యను ఉన్నత విద్యా సంస్థలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల కెరియర్ అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలలో పలు నైపుణ్య, ఉపాధి ఆధారిత కోర్సులు ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, కామర్స్, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధికి వ్యాపార పరివర్తనఅనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సేమినార్కి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా మార్పులు జరుగుతున్నాయన్నారు. ఇ-కామర్స్, మొబైల్ కామర్స్, డిజిటల్ ప్లాట్ఫారమ్లు వంటి సాంకేతిక పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపార పద్ధతులను, వినియోగదారుల ఆలోచనా విధానాలను మారుస్తున్నాయన్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ దశలు ఇప్పుడు డిజిటలైజేషన్, కోవిడ్ మహమ్మారి తరువాత పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో కొత్త శకానికి దారితీసిందని వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉన్నత విద్యా సంస్థలు నాణ్యమైన, ఉపాధి ఆధారిత విద్యను అందించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలలో నైపుణ్య ఆధారిత, ఉపాధి ఆధారిత కోర్సులు ప్రవేశపెట్టామని ఆయన అన్నారు. అంతకుముందు వీ.సీ ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ... డా. బీ.ఆర్. అంబేద్కర్ సామాజిక సంస్కర్త మాత్రమే కాదని సమ్మిళితమైన, సమానమైన ఆర్థిక వ్యవస్థను ఊహించిన ప్రముఖ ఆర్థికవేత్త అని అభివర్ణించారు. సాంకేతిక అభివృద్ధి నేపథ్యంలో ఆర్థిక అవకాశాలకు పెంపొందించడానికి విద్యా బోధనలో సరికొత్త వ్యూహాలను పునరాలోచించుకోవాలన్నారు. డా. బిఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న విశ్వవిద్యాలయం 'డిజిటల్ సాధికారత' దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జయేష్ రంజన్, ఐఏఎస్, మాట్లాడుతూ... తలసరి ఆదాయం పరంగా దేశంలోనే తెలంగాణ అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఉందని, గ్రామీణ ప్రజల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కోటి మంది మహిళలు 'కోటీశ్వరులు'గా మారడానికి వీలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా సాధికారపరచడంపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.

2047 నాటికి 'వికసిత భారత్' నిర్మించాలనే నరేంద్ర మోడీ జాతీయ దార్శనికతను ప్రస్తావిస్తూ భారతదేశం 2047 నాటికి ముప్పై ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకుందని, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా తెలంగాణ ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని పేర్కొన్నారు. హైదరాబాద్ను ప్రధాన ఆర్థిక, ఆవిష్కరణ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కనెక్టివిటీని బలోపేతం చేస్తున్నామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మౌళిక సదుపాయాలు, ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా వినూత్న అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వెల్లడించారు. 2047 నాటికి కార్బన్ ఉద్గార రహిత రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను పెంచేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (కోజికోడ్) డీన్ (ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్) ప్రొఫెసర్ సుదర్శన్ కుంట్లూరు సదస్సులో కీలకోపన్యాసం చేస్తూ పోటీతత్వం, సామాజిక బాధ్యతను కొనసాగించడానికి సుస్థిర-ఆధారిత పరివర్తన వ్యూహాలను అవలంబించాలని సూచించారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, బిజినెస్ రెస్పాన్సిబిలిటీ అండ్ సస్టైనబిలిటీ రిపోర్టింగ్, ఎన్విరాన్మెంటల్, సోషల్ గవర్నెన్స్ ఫ్రేమ్ వర్క్తో సహా అనేక అంశాలను వివరించారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ప్లాట్ఫారమ్ లు పోషిస్తున్న పాత్రను వివరించారు. వనరులను తగ్గించడం, పునర్ వినియోగం, రీసైక్లింగ్ చేయడంపై దృష్టి సారించాలని యువ పరిశోధకులకు సూచించారు. సమస్యలను, సవాళ్లను పరిష్కరించడానికి ఇండస్ట్రీ, ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తూ, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలు మారాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే కొండేగారి రాములు కన్నుమూత

- రాములు మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ సంతాపం



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండేగారి రాములు కన్నుమూశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 1989, 1994లో రెండుసార్లు సీపీఎం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీసీ సంక్షేమశాఖ శాసనసభ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో 120 గజాల్లోని చిన్న ఇంట్లో కుటుంబంతో కలిసి సాధారణ జీవితం గడుపుతున్నారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లోనే ఇప్పటివరకు ఆయన కాలం వెల్లదీశారు. అయితే, రాములు మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. కాగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కూలీ పని చేసిన శ్రమజీవిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ఎదిగి, ప్రజాదరణతో రెండు దఫాలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచి, నిరాడంబర జీవితాన్ని గడిపిన ప్రజల మనిషి కొండేగారి రాములు అని ప్రశంసించారు. ఆయన రాజకీయ జీవితం, రేపటి తరానికి ఆదర్శవంతమైనది అని కొనియాడారు. శోకతప్తులైన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాములు ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

# దేశమంతా నీతిసూత్రాలు

- హలో రాహుల్జీ తెలంగాణలో ఎమైంది?
- పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నరు?.. మరి ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మరోలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు.ఈ మేరకు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ కూడా దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని అన్నారు. కానీ తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే రాజ్యాంగాన్ని రక్షించడమా అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు.



# అమెరికాను భయపెడుతున్న 'మొజాయిక్ కవచం'

## ఎవరీ వ్యూహకర్త జఫారీ?

**టెహ్రాన్, మార్చి 13:** దాదాపు 23 ఏళ్ల కిందట ఇరాక్‌ యుద్ధం చేసిన అమెరికా నేతృత్వంలోని కూటమి సేనలు.. నెల రోజుల్లోపే సద్దాం హుస్సేన్ సైన్యాన్ని మట్టికరిపించాయి. ఇప్పుడు ఇరాన్ను కూడా అలాగే గెలవొచ్చన్న ధీమాతో ఇజ్రాయెల్తో కలిసి రణరంగంలోకి అడుగుపెట్టింది అగ్రరాజ్యం. తొలిరోజే ఖమేనీని అంతమొందించడంతో.. ఇరాన్ పతనం ఖాయమని భావించింది. కానీ, నాటి ఇరాక్ ఓటమినే పాఠాలుగా మలచుకొన్న ఓ వ్యక్తి తమను అడ్డుకుంటాడని అమెరికా ఊహించలేకపోయింది. అతడే ఐఆర్జీసీ మాజీ కమాండ్ ఇన్ చీఫ్ మేజర్ జనరల్ మహమ్మద్ అలీ జఫారీ. అగ్రనేతలను కోల్పోయినా ఈ దాడుల్లో ఇరాన్ కుప్పకూలకుండా దాదాపు రెండు వారాలుగా పోరాడుతోందంటే.. అందుకు కారణం జఫారీ సృష్టించిన రక్షణ కవచమే..! ఇంతకీ ఎవరాయన..? ఏంటా వ్యవస్థ..?

**జఫారీ 'మొజాయిక్' రక్షణ..**

ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహాల్లో 'డీసెంట్రలైజ్డ్ మొజాయిక్ డిఫెన్స్' సిద్ధాంతం అత్యంత కీలకమైనది. అధినాయకత్వం తుడిచిపెట్టుకుపోయినా పట్టు వదలకుండా పోరాడటమే దీని ఉద్దేశం. అలీ జఫారీ ఈ సిద్ధాంత రూపకర్త. దీని ఆధారంగా ముందే రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనిచేయగలిగేలా పాక్షిక-స్వతంత్ర విభాగాలకు అధికారాన్ని అప్పగించారు. అందుకే.. ఫిబ్రవరి 28 నాటి దాడుల్లోనే సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ సహా ఐఆర్జీసీ కమాండర్ ఇన్ చీఫ్ మేజర్ జనరల్ మహమ్మద్ పాక్పోర్, రక్షణ మంత్రి అజీజ్ నజీర్‌జాదే, సాయుధ బలగాల చీఫ్ వంటి ముఖ్య నేతలను కోల్పోయినా.. ఇరాన్ 13 రోజులుగా నిర్విరామంగా ప్రతిఘటిస్తూనే ఉంది.

ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కూడా తమ వికేంద్రీకరణ వ్యూహాలపై పోస్ట్ చేశారు. "గత రెండు దశాబ్దాలుగా మా తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో అమెరికా పరాజయాలను మేం అధ్యయనం చేశాం. వాటి నుంచి పాఠాలు నేర్చుకున్నాం. మా రాజధానిపై బాంబులేసినంత మాత్రాన మా యుద్ధ సామర్థ్యాలను తగ్గించలేరు. ఈ యుద్ధం ఎప్పుడు, ఎక్కడ ముగించాలో.. డీసెంట్రలైజ్డ్ మొజాయిక్ డిఫెన్స్ మాకు నేర్పింది'' అని అమెరికాను హెచ్చరించారు. ఈ మొజాయిక్ సిద్ధాంతంతో ఇరాన్ యుద్ధంలో విజయం సాధిస్తుందో, లేదో కానీ.. దాన్ని ఓడించడం అంత సులువు కాదనే భావన పశ్చిమదేశాలకు కలుగుతోందంటే అందులో అనుమానమేమీ లేదు..!

**ఎవరీ జఫారీ..?**

ఇరాన్ మిలిటరీ అధికారి జనరల్ జఫారీ ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ యూనిట్‌తో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఇస్లామిక్ రివల్యూషన్ తర్వాత కుర్దిస్థాన్ ప్రావిన్స్‌లో పనిచేశారు. 1979-89 మధ్య ఇరాన్-ఇరాక్ యుద్ధంలో పనిచేసిన జఫారీ అంచెలంచెలుగా మిలిటరీలో ఎదిగారు. ఆ యుద్ధం తర్వాత ఐఆర్జీసీ గ్రౌండ్ ఫోర్సెస్‌కు కమాండర్‌గా నియమితులయ్యారు. 2005లో ఐఆర్జీసీ సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అంతకు రెండేళ్ల ముందే అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్'ను అధ్యయనం చేసి అందులో నుంచి పాఠాలు నేర్చుకున్నారు. ఇరాక్‌పై అమెరికా దాడి చేసి ఆ దేశ నియంత సద్దాం హుస్సేన్ చుట్టూ ఉన్న ఉన్నతస్థాయి కమాండ్ వ్యవస్థను ధ్వంసం చేయగలిగింది. దీంతో ఇరాక్ ఆర్మీ, రిపబ్లికన్ గార్డ్ యూనిట్ల మధ్య సమన్వయం లేకుండా పోయింది. సాధారణంగా ఆ దేశంలో సద్దాం అనుమతి లేకుండా ఎవరూ ఏ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు. కమాండ్ వ్యవస్థ లేకపోవడంతో ఆ నిర్ణయాలు కిందిస్థాయి విభాగాలకు చేరడం కష్టతరమైంది. దీంతో ఇరాక్ బలగాలు సొంతంగా పోరాడలేక అగ్రరాజ్యానికి లొంగాల్సి వచ్చింది. వాటిని దగ్గరుండి గమనించిన అలీ జఫారీ.. 'మొజాయిక్ వ్యూహాన్ని' రూపొందించారు. 2007లో ఐఆర్జీసీ కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత దానిని అమల్లోకి తెచ్చారు. ఆ వ్యూహంలో భాగంగానే ఐఆర్జీసీని 31 సెమీ అటానమస్ ప్రావిన్సియల్ కమాండ్స్‌గా విభజించారు. అధికారాన్ని వికేంద్రీకరించారు. ప్రతి కమాండ్కు స్వతంత్ర హెడ్‌క్వార్టర్, కమాండ్ కంట్రోల్ నోడ్స్, క్షిపణులు, డ్రోన్లు వంటి ఆయుధ వ్యవస్థలు ఉంటాయి. ఆయుధాలను నిల్వ చేసుకోవడం, నిఘా వ్యవస్థలను మెరుగుపర్చుకోవడం, స్వతంత్రంగా ఆపరేషన్లను నిర్వహించడం వీటి బాధ్యతే. అత్యవసర పరిస్థితుల్లో హైకమాండ్ ఆదేశాలు లేకున్నా వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం వీటికి ఉంటుంది. ఆ నిర్ణయాలు ఎలా ఉండాలన్న దానిపై ముందే కొన్ని ప్రణాళికలను రూపొందించుకుంటారు. ఇప్పుడు ఇదే సిద్ధాంతాన్ని ఇరాన్ పక్కాగా అమలుచేసి అగ్రరాజ్యాన్ని నిలువరిస్తోంది.

# శశికళ కొత్త పార్టీ.. కటుంబంలా పనిచేస్తామని వెల్లడి



**చెన్నై, మార్చి 13:** తమిళనాడులో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం దివంగత జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ తన కొత్త పార్టీ పేరును ప్రకటించారు. దాని పేరు 'ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం' అని వెల్లడించారు. కొబ్బరి చెట్ల సమూహాన్ని పార్టీ గుర్తుగా ప్రకటించారు. శుక్రవారం తన అనుచరులతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. తమ పార్టీ ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుందని,పార్టీకి కేటాయించిన గుర్తు ఐక్యతకు చిహ్నమన్నారు.

ఇటీవల కొత్త పార్టీ ప్రకటన సందర్భంగా శశికళ మాట్లాడుతూ జయలలిత మరణం తర్వాత పార్టీలో సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తొమ్మిదేళ్లు మౌనంగా ఉన్నానని, ఇకపై ఉండటం కుదరదని, ఇంకా మౌనంగా ఉంటే కార్యకర్తలకు, ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందని శశికళ అన్నారు.

# తృణమూల్ నేతలకు నో అపాయింట్‌మెంట్

- **పర్యటనలో ప్రొటోకాల్ పాటించని టీఎంసీ**
- **ఆనాడే అసంతృప్తి ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము**



**ఢిల్లీ, మార్చి 13:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరిన తృణమూల్ నేతలకు చుక్కెదురైంది. సమయాభావం వల్ల వారిని రాష్ట్రపతి కలవడం సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్లో ఆదివాసీలకు అందుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్రపతికి తెలియజేసేందుకు 12 మంది సభ్యులతో కూడిన టీఎంసీ బృందం అనుమతి కోరగా ఈ మేరకు సమాధానం వచ్చింది. అయితే, వచ్చే వారం అయినా తమకు రాష్ట్రపతి సమయం కేటాయించాలని కోరుతూ ఆ బృందం మరో లేఖను రాష్ట్రపతి భవన్‌కు పంపించినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకొన్న విషయం తెలిసిందే. నాడు దీనిపై ముర్ము స్వయంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉత్తర బెంగాల్లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాడు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు.

తాను ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సిన ఆదివాసీ సదస్సుకు ఆ రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్లోని సిలిగుడికి వెళ్లిన సందర్భంగా ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర విమర్శలు చెలరేగాయి.

# పెషావర్ కాన్సులేట్‌ను శాశ్వతంగా మూసివేస్తున్న అమెరికా


## అమెరికా విదేశాంగశాఖ నిర్ణయం




**వాషింగ్టన్, మార్చి 13:** పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఉన్న కాన్సులేట్‌ను శాశ్వతంగా మూసివేయాలని అమెరికా విదేశాంగశాఖ నిర్ణయించింది. అఫ్గానిస్థాన్‌కు అత్యంత సమీపంలో ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం ఇదే. 2001లో అఫ్గానిస్థాన్‌పై అమెరికా దాడి ప్రారంభానికి ముందు, తరువాత ఈ కాన్సులేట్ కీలక ఆపరేషన్లు, లాజిస్టిక్స్‌కు కేంద్రంగా పని చేసింది. ఈ వారంలో కాంగ్రెస్‌కు పంపిన నోటిఫికేషన్‌లో కాన్సులేట్‌ను మూసివేయాలనే ఉద్దేశాన్ని అమెరికా విదేశాంగశాఖ తెలియజేసింది. దీనివల్ల ఏటా సుమారు 7.5 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయని, పాకిస్థాన్‌లో అమెరికా జాతీయ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని పేర్కొంది. ఇది ఇరాన్ యుద్ధం నేపథ్యంలో తీసుకున్న నిర్ణయం కాదని, దాదాపు ఏడాదికిపైగా పరిశీలనలో ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్ యుద్ధానికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌లోని కరాచీ, పెషావర్ నగరాల్లో నిరసనలు జరిగిన సమయంలో అమెరికా కాన్సులేట్‌లు తాత్కాలికంగా కార్యకలాపాలు నిలిపివేశాయి. ఇకపై అమెరికన్ పౌరులకు సంబంధించిన సేవలను ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం నిర్వహించనుంది.

# ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

- **గోధుమ గింజలతో కవిత చిత్రపటం**
- **సంగారెడ్డి జిల్లా జాగృతి లీగల్ సెల్ శుభాకాంక్షలు**






**హైదరాబాద్,మార్చి 13(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తర ప్రదేశ్‌లో మురాదాబాద్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు జావేద్ మాలిక్ తన నైపుణ్యాన్ని ఉపయోగించి గోధుమ గింజలతో కవిత రూపాన్ని తీర్చిదిద్దారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మను ఆమె ఎత్తుకున్నట్లుగా ఉన్న ఈ చిత్రం, కళాకారుడి సహనానికి , సృజనాత్మకతకు అద్దం పడుతోంది. ఇదిలావుండగా జాగృతి సంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు లీగల్ ప్యానెల్ న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం కవిత ఇంటికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ తెలంగాణలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుని ముందుకు సాగుతున్న తీరును వ్యతిరేక శక్తులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కుట్రలు చేస్తూ కవితను రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నారని, ఎన్ని కుటీల రాజకీయాలు చేసినా, మళ్లీ జైల్లోకి పంపించాలని చూసినా తమ లీగల్ సెల్ వాటిని ఎదర్కొనేందుకు సిద్ధంగా ఉందని జాగృతి లీగల్ సెల్ పర్యవేక్షకుడు, న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

**ప్రపంచ స్థాయికి :**

తెలంగాణ ఉద్యమంలో సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా బతుకమ్మను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహా నాయకురాలు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అని జాగృతి సంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు లీగల్ ప్యానెల్ న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలని, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రజలకు దగ్గర అవుతున్న తీరును చూసి కవిత వ్యతిరేకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. వచ్చే రోజులలో తెలంగాణలో ఒక కొత్త రాజకీయ సన్నివేశం కవిత రూపంలో తెలంగాణ ప్రజలు చూడబోతున్నారని అన్నారు. కవిత రాజకీయ భవిష్యత్తుకై వ్యతిరేకులు ఎటువంటి అడ్డంకులు సృష్టించిన ఎదుర్కోవడానికి న్యాయవాదుల బృందాలు, తమ లీగల్ సెల్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

**సోషల్ మీడియాలో వైరల్ :**

గోధుమలతో రూపొందించిన ఈ భారీ చిత్రం ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు కళాకారుడి పనితనాన్ని మెచ్చుకోవడమే కాకుండా, ఇంత పెద్ద ఎత్తున చిత్రాన్ని రూపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. కవిత పట్ల అభిమానులు చూపిస్తున్న ఈ ఆత్మీయత రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది.

# కడిగిన ముత్యం...కవితక్క

- **జాగృతి లీగల్ సెల్ న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి13(మనం న్యూస్):** జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ తెలంగాణలో తనకంటు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుని ముందుకు సాగుతున్న తీరును చూసి, కుటుంబంలోని వ్యతిరేక శక్తులు జీర్ణించుకోలేకపోతున్నారని జాగృతి సంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు లీగల్ ప్యానెల్ న్యాయవాది తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కవిత జన్మదినం సందర్భంగా జాగృతి రాష్ట్ర కార్యాలయంలో కవితను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కుట్రలు చేస్తూ కవితను రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసులో సుప్రీం కోర్టు కవితకు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ మళ్లీ ఏవో కుట్ర కేసులు పెట్టి కవితను ఇరకాటంలో పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని కుటీల రాజకీయాలు చేసినా, మళ్లీ జైల్లోకి పంపించాలని చూసినా జాగృతి లీగల్ సెల్ ఎదురుకోవడానికి సిద్ధంగా ఉన్నదని చంద్రశేఖర్ రెడ్డి స్పష్టంచేశారు.

**ప్రపంచ స్థాయి గుర్తింపు:**

తెలంగాణసాంస్కృతిక ఉద్యమంలో భాగంగా బతుకమ్మను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహా నాయకురాలు కల్వకుంట్ల కవిత అని,సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలని పరితపించే గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఎకైక నాయకురాలు కవిత మాత్రమేనని ఆయన తెలిపారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రజలకు దగ్గర అవుతున్న తీరును చూసి కవిత వ్యతిరేకులు జీర్ణించుకోలేకపోతున్నారని తుమ్మల పేర్కొన్నారు. రానున్న రోజులలో తెలంగాణలో ఒక కొత్త రాజకీయ శక్తిని కవిత రూపంలో తెలంగాణ ప్రజలు చూడబోతున్నారని చంద్రశేఖర్ తెలిపారు. కవిత రాజకీయ భవిష్యత్తుకై వ్యతిరేకులు ఎటువంటి అడ్డంకులు సృష్టించిన ఎదుర్కోవడానికి న్యాయవాదుల బృందాలు, జాగృతి లీగల్ సెల్ సిద్ధంగా ఉంటు కవిత బాటలోనే తమ ప్రయాణం కొనసాగిస్తామని తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# లొంగారా.. లొంగ దీశారా..!

(మొదటి పేజీ తరువాయి)

తొలుత మమ్మల్ని అరెస్టు చేసి ఆ తర్వాత సరెండర్‌గా చూపించారని ఇందులో మా లోపం ఏమి లేదన్నారు. ప్రాణ భయంతోనే లొంగిపోయామనడంలో నిజం లేదనిచ ఆపరేషన్ కగారుతో పాటు అంతకు ముందు జరిగిన అనేక ఆపరేషన్ల సమయంలో అడవుల్లోనే ఉన్నామన్నారు. అప్పుడు అనేక దాడులు కూడా జరిగాయన్నారు. విభిన్న ప్రాంతాల్లో ఉన్న కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం కోసమే బయటకు వచ్చామని ఇంతలో పోలీసులు అరెస్టు చేశారన్నారు. బయటకు వచ్చిన మమ్మల్నీ పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారు తప్ప ప్రాణభయంతో మేము బయటకు రాలేదన్నారు.

**కగార్‌పై:**

'ఆపరేషన్ కగార్' మాకు చాలా చిన్న విషయమని మాజీ మావోయిస్టు నేత దేవ్ జీ హాట్ కామెంట్స్ చేశారు. పార్టీలో లక్షలాది మంది ప్రజలతో కలిసి పట్టణాల్లో, మైదానాల్లో, అడవుల్లో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించిన ప్రజా పునాది కలిగిన మావోయిస్టు పార్టీని ఏ 'ఆపరేషన్ కగార్' కూడా ఏమీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా సకాలంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడమే పార్టీకి నష్టం కలిగించిందన్నారు ఆ లోపాన్ని సరిదిద్దుకునే అవకాశం లేకుండా కేంద్ర బలగాలు తమపై ఎడతెరిపి లేకుండా దాడులు చేసి పార్టీని బలహీర పరిచాయన్నారు. మావోయిస్టు పార్టీ తన వైఫల్యాలను సమీక్షించుకునే లోపే'ఆపరేషన్ కగార్ యుద్ధం మొదలయ్యే సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదని, కేంద్రం పట్టించుకోనందునే ప్రతిఘటన అనివార్యమైందని దేవ్ జీ అన్నారు. బస్వరాజును కోల్పోయిన అనంతరం పార్టీలో కీలక నేతలు కొందరు లోపల(అడవుల్లో).. కొందరు బయట(జనంలో) ఉండాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ క్రమంలోనే హిడ్మా ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోవాలనుకున్నారని, విజయవాడలో పోలీసు శాఖలో కొందరు నమ్మకస్తులు ఉన్నారని హిడ్మా పదేపదే చెప్పావారన్నారు. అయితే మాకు అనుమానం వచ్చి వద్దని వారించినా హిడ్మా వినకుండా మాకే సర్దిజెప్పే ప్రయత్నం చేశారన్నారు. హిడ్మా అంచనాలు సరైనవి కావని, మేము అనుకున్నట్లే అతన్ని ట్రాప్ చేసి, అరెస్ట్ చేసి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారన్నారు. హిడ్మాది వందశాతం బూటకపు ఎన్‌కౌంటర్' అని దేవ్ జీ కీలక వ్యాఖ్యలు చేశారు.

**అరెస్ట్ చేస్తే రిమాండ్ పంపరా..! :**

ఆపరేషన్ కగార్ కారణంగా వందలాది మంది మావోయిస్టులు ప్రాణాలు పోగొట్టుకున్న విషయం విదితమే. ఈక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డిలు తెలంగాణ మావోలను లొంగుబాట పట్టించి వారి ప్రాణాలను నిలిపేందుకు శ్రమించారు. ఇందులో భాగంగా ఇటీవల కాలంలో లొంగిపోయిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలకు వైద్య సదుపాయాలతో పాటు రివార్డులిచ్చి వారిని గౌరవంగా జనజీవన స్రవంతిలో కలిసినట్లు తెలిపారు. అయితే దేవ్ జీ, రాజిరెడ్డి తదితర మాజీ మావోలు తాము సరెండర్ కాలేదని, పోలీసులే పట్టుకుని లొంగిపోయినట్లు చూపించారని పలు సందర్భాలలో కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో గతంలో జనజీవన స్రవంతిలో కలిసిన మావోలు వీరి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము గతంలో అరెస్ట్ అయిన సమయంలో రిమాండ్ విధించి జైలుకు తరలించారని, మరి మీరుకూడా అరెస్ట్ అయితే కేసులు పెట్టి ఎందుకు జైలుకు తరలించలేదని చురకలంటిస్తున్నారు. పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన వారు అటు పార్టీపై ఇటు పోలీసు వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. కొందరు మాజీ మావోలు కీలక వారి ఉనికి కోసమే మీడియా ఎదుట ఇష్టానుసారం మాట్లాడటం సబబు కాదని తేల్చిచెబుతున్నారు.

**ఖద్దరు దారి పట్టం :**

పార్టీని వీడిన తాము రాజకీయాల్లోకి వచ్చే ప్రస్తే లేదని మాజీ మావోయిస్టు రాజిరెడ్డి స్పష్టం చేశారు. సమాజంలో పరిస్థితులు మారినా పేదరికం, వేధింపులు తగ్గలేదని, దోపిడీ రూపం మారిందే కాని ఆగలేదన్నారు. ఈ పరిస్థితులపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని కీలక ప్రకటన చేశారు.ఈ దశలో మేము ఏ రాజకీయ పార్టీలో చేరబోమని, పార్లమెంటరీ రాజకీయాల్లోకి వెళ్లాల్సిన గత్యంతరం లేదన్నారు. అయితే ప్రజాసమస్యలపై పోరాటాలకు మా మద్దతు ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మాజీ మావోయిస్టులు, అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసే కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. ప్రజల కోసమే మా శేష జీవితం ఉండబోతుందనేది ప్రజలకు వివరిస్తామన్నామని, మిగిలిన మావోయిస్టులను అజ్ఞాతం నుంచి బయటకు పిలవాలని ఆపరేషన్ కగార్‌ను తాత్కాలికంగా వాయిదా వేయిస్తామని మమ్మల్ని కలిసిన ఇంటెలిజెన్స్ అధికారులు చెప్పారని రాజిరెడ్డి చెప్పారు. అయితే బహిరంగ ప్రకటన చేస్తే వారిని పిలవడానికి మేము సిద్ధమే అని తాము చెప్పామన్నారు.

**గణపతి ఆరోగ్యం సహకరించదు:**

మావోయిస్టు అగ్రనేత గణపతి ప్రస్తుతం ఉద్యమాన్ని నడిపే పరిస్థితి లేదని ఆయన ఆరోగ్యం సహకరించనందువల్లే ఉద్యమ బాధ్యతలు అప్పగించి బయటకు వెళ్లిపోయారన్నారు. రెండేళ్ల క్రితం ఆయనను కలిశామన్నారు. మావోయిస్టు ఉద్యమం బలహీనపడిపోయిందనేది స్పష్టంగా తెలుస్తోందని అయితే మిగిలి ఉన్న కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇప్పటికీ ప్రజల మధ్యే తిరుగుతున్నారని వారంతా ఏదైనా ఆలోచన చేస్తే భవిష్యత్ కార్యాచరణ నిర్ధారించుకోవచ్చు. వారికి మా సహకారం కూడా ఉంటుందన్నారు. మాతో వారు ఏకీభవిస్తారా లేదా అనేది వారి ఇష్టం అన్నారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో జరిగిన నష్టాలకు కారణం ఏంటనేది ఇంకా మిగిలి ఉన్న, లొంగిపోయిన, జైల్లో ఉన్న మావోయిస్టులతో చర్చించి ఒక నిర్ధారణకు రావాల్సి ఉందన్నారు.

**ఆపరేషన్ కు తాత్కాలిక బ్రేక్ ప్రతిపాదన:**

.చివరిసారిగా అగ్రనేత గణపతిని ఎప్పుడు చూశారు? అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు దేవ్జీ స్పందిస్తూ.. '2023లో చివరి సారిగా కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. అప్పుడే గణపతిని చూశాను. ఇక ఆ తర్వాత ఆయన దారిలో ఆయన వెళ్లారు. మళ్లీ కనిపించలేదు' అని దేవ్జీ చెప్పుకొచ్చారు.

మావోయిస్టు పార్టీ నిర్వీర్యం కావడానికి 'ఆపరేషన్ కగార్' కంటే పార్టీ తీసుకున్న తప్పుడు రాజకీయ నిర్ణయాలే ప్రధాన కారణమని మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు

- ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు
- బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు
- అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు
- చర్యలు కఠినంగా ఉంటాయి
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ములుగు, మార్చి 13, మనం ప్రతినిధిః గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, గ్యాస్ సరఫరా పై అపోహలు నమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని, గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ పర్యవేక్షణ జరుగుతుందని మంత్రి తెలిపారు. ఆమెరికా-ఇరాన్ కు మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు ఆవశ్యకం



భీమదేవరపల్లి, మార్చి 13 మనం న్యూస్: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ఆవశ్యకమని ప్రాద్య వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సిహెచ్ రాములు సూచించారు. శుక్రవారం రోజున కొత్తపెల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సిహెచ్ రాములు హాజరై క్షేత్రస్థాయిలో వ్యవసాయ పంటలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ రైతులు భూమిని అవసరం ఉన్నంత దున్నాలని, అనేకసార్లు దున్ని భూ సారవంతమను నిర్వీర్యం చేయొద్దని తెలియజేశారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో లోపాలను తెలుసుకొని అవసరమైన ఎరువులు అనే వాడి భూ కాలుష్యాన్ని నీటి కాలుష్యాన్ని నివారించేందుకు సహకరించాలని అన్నారు. అధిక దిగుబడి కోసం అనవసరమైన ఎరువులు వాడి ఆర్థిక భారాన్ని పెంచుకోవద్దని అన్నారు. రైతులు వివిధ పంటల అవశేషాలను కాల్చకుండా నేలలో కలవడం వలన నీళ్లలోని కార్బన్ అభివృద్ధి చెంది సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి పోషకాలు యొక్క వినియోగ సామర్థ్యం మొక్కలకు పెరుగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఆదారిత వ్యర్థాలతో ద్రవ జీవామృతం ఘనజీవామృతం అగ్ని అస్త్రం లాంటి తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని ట్రస్టర్ల ఏఈవోలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



అనంతగిరి మార్చి 13( మనం న్యూస్)ః మండలంలోని వాయిలసింగవరం గ్రామంలో స్థానిక సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 8 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నట్లు గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు వార్డు సభ్యులు భవాని గద్దె రఘు కంటు వేణు సుబ్బారావు మురళి వెంకన్న మురళి నాగమల్లేశ్వరరావు నాగేశ్వరరావు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ కొరత లేదు



సూర్యాపేట, మార్చి 13 (మనం ప్రతినిధి)ః జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లకు ఎలాంటి కొరతలేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.శుక్రవారం అయనఅదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని క సూర్యాపేట జిల్లాల్ 4, 15, 509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని ప్రస్తుతం జిల్లాలో 17, 647 డొమెస్టిక్ సిలిండర్లు,న552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సరఫరా చేయడం జరుగుతున్నదని జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సరిపడా ఉందని గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వచేసిన 41 గ్యాస్ సిలిండర్లు సీజ్

- గ్యాస్ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించి అక్రమ మార్గంలో అమ్మితే కఠిన చర్యలు
- సరఫరా ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలి
- నకిలీ వ్యక్తులకు గ్యాస్ బండలు ఇవ్వకూడదు
- అమ్మకాలపై పోలీస్ శాఖ నిఘా పెట్టింది
- సరిపడా గ్యాస్ ప్రజలు ఆందోళన చెందవద్దు
- జిల్లా ఎస్పీ కే నరసింహ



సూర్యాపేట, మార్చి 13 (మనం ప్రతినిధి)ః గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కే నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. శుక్రవారం నమ్మదగిన సమాచారం పై సూర్యాపేట పట్టణ పోలీసులు స్పెషల్ బ్రాంచ్ పోలీస్ సిబ్బంది సూర్యాపేట పట్టణంలో పిఎస్ఆర్ సెంటర్ నందు ఒక షాపులో తనిఖీలు నిర్వహించగా అందులో అక్రమంగా నిల్వచేసిన 41 సిలిండర్ లు గుర్తించడం జరిగిందని వీటిని సీజ్ చేశామని తెలిపారు. ఇందులో 21 గృహ ఉపయోగకరమైనయని, 20 వాణిజ్యపరమైనని ఉన్నాయని అన్నారు. దీనికి సంబంధించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేయడం జరిగిందని ప్రజల అవసరాలకు ఉపయోగపడే గ్యాస్ సిలిండర్లను అక్రమ మార్గంలో అమ్మిన, అక్రమంగా నిలువచేసిన, కృత్రిమ కొరత సృష్టించిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ ఉపయోగకరమైన గ్యాస్ సిలిండర్లను వాణిజ్యపరంగా అమ్మకూడదని సూచించారు. ప్రజల ఉపయోగాలు, హాస్పటల్ వినియోగానికి నిలువలు అందుబాటులో ఉన్నాయి. గ్యాస్ సిలిండర్ లను అక్రమ మార్గంలోకి తరలించినా, గ్యాస్ నిల్వలపై, గ్యాస్ ధరలపై ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల అవసరాలకు సరిపడా గ్యాస్ సిలిండర్ నిలువలు అందుబాటులో ఉన్నాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం సంబంధిత ఏజెన్సీలు గ్రామాలలో, పట్టణాలలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను సకాలంలో అందిస్తాయని అన్నారు.

ప్రజలు ఆందోళన చెంది గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరవద్దని, గ్యాస్ టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించవద్దని కోరారు. గ్యాస్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా నకిలీ వ్యక్తులు గ్యాస్ ను బుక్ చేసినట్లయితే అలాంటి వారిని గుర్తించాలని కోరారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు బాధ్యతగా ఉండాలని గ్యాస్ అమ్మకాల కు సంబంధించి పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధ ఆజ్ఞలు అమలు... మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జిల్లా లోని 10వ తరగతి పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రజలు గుంపులుగా చేరడంపై నిషేధ ఆజ్ఞలు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పి నరసింహ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పి ప్రకటనలో స్పష్టం చేశారు.

# నిర్లక్ష్యపు అధికారి వెంటనే తొలగించాలి



భీమదేవరపల్లి, మార్చి 13 మనం న్యూస్ః మండల కేంద్రంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ ఏఈని వెంటనే తొలగించాలని బిజెపి జిల్లా కౌన్సిల్ నెంబర్ పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మనం న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ మండల పరిధి గ్రామాలలో తాగునీటి సమస్యల పరిష్కారంలో ఏఈ సతీష్ నిర్లక్ష్యంగా ఉంటున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో బోర్లు పైప్ లైన్లు మరమ్మత్తులు పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మండల పరిషత్ కార్యాలయం కలిగిన కనిపించకపోవడంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఏ ఈ సతీష్ పై కఠిన చర్యలు తీసుకొని మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్నికోరారు.

# బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా చెరుకుపల్లి లక్ష్మణ్



జాజిరెడ్డిగూడెం, మార్చి 13(మనం న్యూస్)ః బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా చెరుకుపల్లి లక్ష్మణ్ను నియమించారు.భువనగిరి పార్లమెంట్ పరిధిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాంబాబు ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ సమక్షంలో చెరుకుపల్లి లక్ష్మణ్కు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా చెరుకుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.మహాత్మా జ్యోతిబాపూలే, డా. బీఆర్ అంబేద్కర్ ఆలోచనలతో స్థాపితమైన బహుజన్ సమాజ్ పార్టీ సామాజిక న్యాయం, సమానత్వం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల సాధన కోసం పార్టీ పోరాడుతుందని తెలిపారు.బహుజన కులాలను ఐక్యం చేసి సమతా సమాజ నిర్మాణం లక్ష్యంగా మాన్యవర్ కాన్షీరామ్ 1984లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారని పేర్కొన్నారు.బహుజన సమాజానికి నాయకత్వం అవసరమని, పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ

తుంగతుర్తి, మార్చి 13,( మనం న్యూస్)ః తుంగతుర్తి మండలం అన్నారంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శనివారం సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. పశుపోషకులు నిర్లక్ష్యం చేయకుండా మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ వ్యాధి సోకితే పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో 31 ఆవులు ,1 ఎద్దు,76 గేదెలకు మొత్తం 107 పశువులకి టీకాలు వేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ నరేష్, వైద్య సిబ్బంది రవి ,రాజశేఖర్ ,లింగయ్య, శ్రీను మరియు ఉప సర్పంచ్ వెలిశాల సరిత,వార్డు సభ్యులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.


# ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



గోవిందరావుపేట, మార్చి13, మనంన్యూస్ః ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ గోవిందరావుపేట మండలంలోని పసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరు పట్టికను పరిశీలించి, అందరూ రెగ్యులర్ గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులు ఇతర సిబ్బంది సమయానికి సమయపాలన పాటిస్తున్నారా లేదా ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నారా లేదా అనే అంశాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. వైద్యులు ఇతర సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని ప్రజలు వేచి ఉండే పరిస్థితి రాకూడదని సూచించారు. గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పించాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో అత్యవసర మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ఫార్మా స్టాక్ రిజిస్టర్లు ప్రతిరోజూ అప్డేట్ చేయాలని ఫార్మసిస్టు్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగమైన అయినా పరికరాలను తొలగించాలని, ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి , పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి వార్డులు, వాష్రూమ్లను నిరంతరం శుభ్రం చేయించాలని, వైద్యం కోసం వచ్చేవారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధు, ఇతర సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మిచెక్కుల పంపిణీ



భీమదేవరపల్లి, మార్చి 13 మనం న్యూస్: ముస్తఫా పూర్ గ్రామంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం రోజున గ్రామపంచాయతీ ప్రాంగణంలో పంచాయతీ కార్యదర్శి వీరన్న నాయక్ ఏర్పాటు చేస్తే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలుకతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడబిడ్డలకు భరోసాగా కళ్యాణ లక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని గుర్తు చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోత్సాహంతో ఈ ప్రాంత అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతూ కొత్తకొండ వీరభద్ర ఆలయ అభివృద్ధికి కళ్యాణ మండపం, గుట్ట పైకి దారి, ప్లాస్టిక్ పదార్థాల వాడక నిషేధం నినాదంతో ఆలయంలో జరిగే పుణ్య కార్యక్రమాలకు స్టీల్ సామాగ్రి అందజేయడం, ప్రతి పౌర్ణమి నాడు ఆలయంలో సమస్త ప్రజానీకం ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడానికి మంత్రి తన సొంత ఖర్చులతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం సుజాత, ఉప సర్పంచ్ మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అరవింద్ గౌడ్ వార్డు సభ్యులు మాడుగుల సంపత్ సులోచన రమేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# 10వ తరగతి పరీక్ష కేంద్రాల 163 బి.ఎన్.ఎస్ ఎస్ అమలు

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్

జగిత్యాల, మార్చి 13 (మనం ప్రతినిధి)ః మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జిల్లా పరిధిలోని 68 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంట వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో వుంటుందని తెలిపారు.పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రల చుట్టుపక్కల ఏలాంటి సభలు,సమావేశాలు, ర్యాలీలకు,మైకులు, డిజేలతో ఊరేగింపులు,దర్నాలు, నిర్వహించరాదని పెర్కొన్నారు.పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాసే విధంగా ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# మీ దీవెనలతో అభివృద్ధి పథంలోకి ప్రజా ప్రభుత్వం

- మండల కేంద్రంలోఘనంగా పభుత్వ ఇఫ్తార్ విందు కార్యక్రమం



మహాదేవపూర్, మార్చి,13(మనం న్యూస్)ః పవిత్ర రంజాన్ మాసంలో ప్రజా ప్రభుత్వానికి మీ దీవెనలు రాష్ట్ర ప్రజలకు అలాగే ముస్లిం మైనార్టీలకు మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లి దిశగా చేస్తుందని జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అక్బర్ ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,జిల్లా ప్రధాన కార్యదర్శి, మతీన్ అన్నారు. శుక్రవారం రోజు మండల కేంద్రంలో ప్రభుత్వ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. మండల కేంద్రంలోని, నాలుగు మస్జిద్ లలో , మైనారిటీల రోజా విరమించుటకు, ఇఫ్తార్లు అందించడం జరిగింది. అలాగే ఇఫ్తార్ అనంతరం మదీనా మస్జిద్ ఆభరణలో, విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ పార్టీ మరియు ఇఫ్తార్ విందు కార్యక్రమంలో, పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో, మీ ప్రార్థన ల తో ప్రజా ప్రభుత్వాన్ని దీవెనలు అందించి ఆశీర్వదించాలని కోరడం జరిగింది. ప్రత్యేకంగా మైనార్టీల అభివృద్ధి కొరకు, రాష్ట్ర ప్రభుత్వం, ఇంద్రమ్మ ఇండ్లు, మైనారిటీ అభివృద్ధి నిధులు, అందించడం జరుగుతుందని, మీరు అందించిన దీవెనలే ఈరోజు ప్రజా ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు, పవిత్ర మాసంలో మీ దీవెనలు అందించాచి, మరిన్ని అభివృద్ధి నిధులు సాధించుకునేలా ప్రార్థించాలని కోరారు ప్రముఖులు, ప్రభుత్వ ఇఫ్తార్ విందులో, మండల కేంద్రంలోని మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి, అలాగే మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అక్బర్ ఖాన్, పర్యవేక్షణలో ఇఫ్తార్ విందు కార్యక్రమం పెద్ద మొత్తంగా విజయవంతం కావడం జరిగింది. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సీనియర్ కాంగ్రెస్ మరియు యువజన కాంగ్రెస్, మైనారిటీ కాంగ్రెస్, కార్యకర్తల సహాయంతో ఇఫ్తార్ విందు కార్యక్రమం విజయవంతం కావడం జరిగింది.

# జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ లపై ప్రత్యేక నిఘా పెట్టండి

- కొల్లాపూర్ పట్టణంలో సాయి కృప ఆసుపత్రి సీజ్
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 13 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల పై ప్రత్యేక నిఘా పెట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, కమిటీ సభ్యులు ఐ.ఎం.ఏ డిస్టిక్ ప్రెసిడెంట్ డాక్టర్ చెన్నయ్య, డి ఎం హెచ్ ఓ డాక్టర్ రవి నాయక్, అధికారులు పాల్గొన్నారు. కొల్లాపూర్ పట్టణంలో ఉన్న సాయికృప ప్రైవేట్ ఆస్పత్రిలో ఇటీవల ఒక బాలికకు అక్రమంగా అబార్షన్ నిర్వహించారనే ఆరోపణలపై కమిటీ చర్చించింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆసుపత్రిని సందర్శించి సమర్పించిన నివేదికలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు సాయికృప ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్ల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్వోను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న 38 స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులపై తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ**

జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్ లో పొందుపరిచిన నిబంధన మేరకు ఆసుపత్రులు కొనసాగుతున్నాయా లేదా అన్న అంశంపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ జరపాలని కోరారు. స్కానింగ్ సెంటర్ల పై పటిష్ట నిఘా పెట్టాలన్నారు. ఇబ్బందులు ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలని కోరారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్ చట్టం, 2010 ప్రకారం, ఆసుపత్రులు, క్లినిక్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోమ్ల నిర్వహణ తదితర అంశాలపైనా దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డిప్యూటీ డిమో రాజగోపాల్ చారి, శ్రీనివాసులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం

- శ్రీరామనవమి వార్షిక జాతర స్టీల్ టెండర్లు

**మహాదేవపూర్,మార్చి 13 (మనం న్యూస్) :** మహాదేవపూర్ మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతతో అంటూ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందని అన్నారు సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, డ్రై డే కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ తో పాటు గ్రామ కార్యదర్శికల్పన, గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గృహాల్లో పర్యవేక్షించి మురికి నీరు స్టోరేజ్ వాటర్ నిలువ చేయకూడదని, పరిసరప్రాంతాల్లో సైతంఉనికినీరునిలువఉండకుండా చూడాలని అన్నారు సర్పంచ్, డ్రైడి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బందితోపాటు ఆశా వర్కర్లు ఉన్నారు.



శ్రీరామనవమి వార్షిక జాతర స్టీల్ టెండర్లు

వందగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వార్షిక జాతరను పురస్కరించుకొని, పలు రకాల స్టీల్ టెండర్ కొరకు వేలం పాట కార్యక్రమాన్ని మహాదేవపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ తో పాటు గ్రామకార్యదర్శి కల్పన, దేవస్థాన ఈవో, అర్చకులు గ్రామ ప్రజలు ఈ వేలం పాటలో పాల్గొనడం జరిగింది.

# గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



- తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి మార్చి13(మనం న్యూస్):** గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని జెపి నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంతో పాటు ఆహార తయారీకి వినియోగిస్తున్న సరుకులను, వంటగదిని ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యతతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలు వైద్య పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకొని విద్యార్థులకు కౌమర దశలో సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే భవిష్యత్తులో ఆరోగ్యం ఉంటారని కచ్చితంగా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు.ఈ సందర్భంగా ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటగది పరిశుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ వెంట కమీషన్ సభ్యురాలు శారద, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులను అభినందించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి



**మహాదేవపూర్, మార్చి13మనం న్యూస్:** గత నవంబర్లో జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ లో భూపాలపల్లి జిల్లా నుంచి 23 మంది విద్యార్థులు ఎంపికవగా అందులో 8 మంది విద్యార్థులు శివాని తన్మయి అక్షిత జుబియా అంజలి మనస్విని స్లోహిత్ , స్నిగ్ధ లు మహాదేవపూర్ బాలికల పాఠశాలకు చెందిన వారే కావడం గర్వించదగ్గ విషయమని ఆందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డిని ఉపాధ్యాయ బృందాన్ని మరియు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థులు ఎంపిక కావడానికి కృషిచేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మడక మధుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజేందర్, సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్, జిల్లాగ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రజా ప్రతినిధులు గ్రామాలలో సమస్యలు తెలుసుకోవాలి

- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- గామాలలో పర్యటిస్తేనే సమస్యలు తెలుస్తాయి
- నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ మార్చి 13 (మనం ప్రతినిధి ):** నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ లో నిర్వహించిన మిర్యాలగూడ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజులపాటు నిర్వహించవలసిన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం రూపొందించి పది ప్రధాన అంశాలను తీసుకొని వాటి పై అవగాహనతో పాటు,సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా, ఇప్పటివరకు ప్రభుత్వం సాధించిన అభివృద్ధి పై ప్రజలకు తెలియజేసేందుకు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. ఇందులో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్యాలయాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్దేశించడం జరిగిందని, అంతేకాక అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కారం చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవోలు గ్రామ వారీగా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఏప్రిల్ 2 న నిర్వహించనున్న గ్రామసభలలో వాటిని చదివి వినిపించాలని, అదేవిధంగా ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను గ్రామసభలలో,మున్సిపల్ పట్టణాలలో చర్చించాలన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల ను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, ఎల్ -3 నుండి ఎల్- 1 కు వచ్చిన కొన్ని ఇండ్ల సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నామని , ఉగాది నాటికి సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలను చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ ప్రాధామ్య అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్,మున్సిపల్ కమిషనర్,జిల్లా అధికారులు హాజరయ్యారు.ఈ నెల 14 నుండి జరిగే ఎస్ ఎస్ సి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ,జిల్లా వ్యాప్తంగా విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు.

# గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లపై శిక్షణ కార్యక్రమం

**దుగ్గొండి. మార్చి 13 (మనం న్యూస్):** తాటి చెట్లు ఎక్కే గీత కార్మికుల (గౌడ కులస్థుల) భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ నేపథ్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాటమయ్య రక్షణ కిట్లపై పనితీరును ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, మల్లంపల్లి మాజీ సర్పంచ్ చుక్క రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రక్షణ కిట్ల శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాటమయ్య కిట్లు గౌడన్నలకు సంజీవనిలాంటివని, తాటి చెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల ఈ కార్యక్రమం మేరకు



ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గీత కార్మికుల రక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు గీత కార్మికుల ఇబ్బందులను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రక్షణ కిట్ల పంపిణీ ప్రారంభించేందుకు చొరవ చూపారని చుక్క రమేష్ తెలిపారు. ఈ కిట్ల వినియోగంతో చెట్లు ఎక్కేటప్పుడు ప్రమాదాలు తగ్గి, గీత కార్మికులు సురక్షితంగా, ఉపయోగకరంగా పనిచేయగలరని ఆయన వివరించారు. గతంలో జరిగిన ప్రమాదాలు, మరణాలను గుర్తుచేస్తూ భవిష్యత్తులో ఏ గీత కార్మికుడు కూడా ప్రమాదానికి గురికాకూడదనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. కిట్లపై ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రతి గీత కార్మికుడు వీటిని తప్పనిసరిగా వినియోగించుకోవాలని చుక్క రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.

మాజీ ఎంపీపీ బూరుగు రవీందర్ గౌడ్ తో కలిసి కిట్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏబీసీ డీవో ధర్మంత్ వీరన్న, ఎక్సైజ్ కానిస్టేబుల్ కె. నాగరాజు, సంక్షేమ వార్డెన్లు నరేందర్, రాకేష్, ట్రైనర్లు నర్సయ్య, గురువయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, దుగ్గొండి గౌడ సంఘం అధ్యక్షులు గైని భాస్కర్, మల్లంపల్లి అధ్యక్షులు దొనికల సదానందం, లక్ష్మీపురం అధ్యక్షులు శరత్, మహమ్మదపురం అధ్యక్షులు చింత బాబు తదితర గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.



# మాజీ జెడ్పీటీసి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

**మల్హర్,మార్చి13(మనం న్యూస్):** మండలంలోని వల్లెం కుంటలో కాంగ్రెస్ నాయకులు మల్హర్ మాజీ జడ్పీటీసీ ఐత కోమల - రాజిరెడ్డి తండ్రి ఐత సర్వా రెడ్డి ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్,.. ఎస్పీ

**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 13 (మనం బ్యూరో):**తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సహా కుటుంబ సమేతంగా కలిసి శుక్రవారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు హైదరాబాద్ నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తున్నారు. ఇట్టి విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్ కు శుక్రవారం సాయంత్రం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం



పలికారు. అనంతరం గవర్నర్ కు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వెళ్ళడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార పంపిణీలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి తీరాలి




- విద్యార్థుల ఆహార హక్కుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు
- తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 13 (మనం బ్యూరో):** జిల్లాలోని పేదలు, విద్యార్థులు, గర్భిణులకు ఆహార భద్రత కింద అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాల మేరకు అంది తీరాలని, అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలుపై శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి తెలంగాణ ఆహార కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, రంగినేని శారద, అదనపు కలెక్టర్ అమరేందర్, జడ్పీ సీఈవో దేవ సహాయం, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. తౌలుత పౌరసరఫరాలు, ఐసీడీఎస్, వెల్ఫేర్ హాస్టల్స్, మధ్యాహ్న భోజన పథకం, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, సంక్షేమ వసతి గృహ సంరక్షకులు, అంగన్వాడీ కార్యకర్తలతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గోలి శ్రీనివాస్రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లోని అంగన్వాడీలు, వసతి గృహాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేశామన్నారు. జిల్లాలో ఇటీవలే కల్వకుర్తిలో పర్యటించిన అనంతరం శుక్రవారం రోజునా అచ్చంపేటలో పర్యటించిన సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన మెనూ ప్రకారం భోజనము అందడం లేదని గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు.

# మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్ మార్చి 13 మనం న్యూస్:** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూౌకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లిలో మైనార్టీ కాంగ్రెస్ నేత అంజద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీ వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్లో రూ 5 వేల కోట్లు కేటాయించగా, మైనారిటీ గురుకులాలు, మసీదుల మరమ్మత్తులకు నిధులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, మైనార్టీలకు సబ్ సబ్ ప్లాన్ వర్తింపు, యువత మహిళలకు సబ్సిడీ రుణాలు, విద్యా ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట తదితర వర్తింప చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ మైనార్టీల సంక్షేమంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీలో పెద్ద ఎత్తున అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు నిమ్మ రంగారెడ్డి, నాయిని యాదగిరి, గుంటూకు శ్రీనివాస్, కౌన్సిలర్ నర్సింహ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, ఉపేందర్ రెడ్డి,అశోక్ రెడ్డి, అజ్గర్, సుకేందర్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్ జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ల్యాబ్ టెక్నీషియన్స్ డే' వేడుకలు

**గజ్వేల్ మార్చి13 మనం న్యూస్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ మహేందర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని, రోగులకు వేగవంతమైన, ఖచ్చితమైన వైద్య సేవలు అందించడంలో తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వైద్యులకు, రోగులకు మధ్య వారధిలా ఉంటూ నాణ్యమైన పరీక్షలు నిర్వహించడం తమ బాధ్యతని పేర్కొన్నారు. ఈ



వేడుకల్లో జిల్లా ఆసుపత్రికి చెందిన పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శాండ్విక్ పరిశ్రమలో సిఐటియు ఘనవిజయం

- హెచ్ఎంఎస్పై 131 ఓట్లతో భారీ విజయం
- మరోసారి విజయకేతనం
- ఎగురవేసిన కార్మికుల వేగు చుక్క
- 9కార్మిక శ్రేయస్సే సిఐటియు లక్ష్యం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు

**సంగారెడ్డి మార్చి 13మనం న్యూస్ ప్రతినిధి :** కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిన శాండ్విక్ పరిశ్రమ లో సిఐటియు ఘన విజయం సాధించింది. పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు, హెచ్ఎంఎస్ పై 131 ఓట్ల భారీ విజయం సాధించి మరోసారి స్వగర్వంగా విజయకేతనం ఎగురవేసింది కార్మికుల వేగుచుక్క... సిఐటియు సీఐటీయూ తరఫున సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు పరిశ్రమ



యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు. హెచ్ఎంఎస్ తరఫున విశ్వ ప్రసాద్ బరిలో ఉన్నారు. పరిశ్రమలో మొత్తము 186 ఓట్లు గాను సిఐటియుకు 157,, హెచ్ఎంఎస్ కు 26 ఓట్లు రాగ 2 ఓట్లు వేయలేదు. హెచ్ఎంఎస్ పై సిఐటియు 131 ఓట్లతో భారీ విజయం సాధించింది. ఈ సందర్భంగా పరిశ్రమ లోపలి నుంచి జాతీయ రహదారి వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ విజయం కార్మికుల విజయం ఈ విజయం మరింత బాధ్యతను పెంచింది సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు శాండ్విక్ పరిశ్రమ విజయం కార్మికుల విజయమని, విజయం మరింత బాధ్యతను పెంచిందని, ఇది కార్మికుల విజయంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అభివర్ణించారు. కార్మిక వర్గాన్ని చీల్చటానికి ఎన్ని కుయుక్తులు పన్నిన కార్మిక వర్గం ఐక్యంగా నిలిచి కుట్రలను పటాపంచలు చేస్తూ మరోసారి చారిత్రాత్మక విజయనందించారని కొనియాడారు. కార్మికులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చనేది ఈ శాండ్విక్ విజయమే ఒక నిదర్శనం అన్నారు. ఈ విజయంలో పాలు పంచుకున్న కార్మికులందరికీ ఈ విజయం అంకితం చేస్తూ కార్మికులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలోనే చారిత్రాత్మక విజయమని పరిశ్రమంలో గత 41 సంవత్సరాలుగా కార్మికుల కోసం చట్టపరమైన సౌకర్యాలు సాధించుకుంటూ జిల్లాలోని మిగతా యూనియన్లకు ఆదర్శవంతంగా నిలిచిందన్నారు.

ఈ విజయంతో పరిశ్రమలో కార్మికులు విజయోత్సవంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, జనరల్ సెక్రెటరీ మనోహర్, ఆఫీస్ బేరర్స్ సత్తిబాబు, వీర రావు, సదాశివరెడ్డి, వెంకట్రావు, కమిటీ సభ్యులు, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# 'కార్మేని సెల్వం' టీజర్ విడుదల

సముద్రఖని ప్రధాన పాత్రలో, రామ్ చక్రి దర్శకత్వంలో పాత్వే ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. ఆధునిక సమాజంలో డబ్బు, కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్ ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఏప్రిల్ 3న ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలోకి రానుంది. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అనే సముద్రఖని వాయిస్ ఓవర్ తో మొదలైన ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈఎంఐలు, క్రెడిట్ కార్డుల మోజు, క్రిప్టో పెట్టుబడులు, రాత్రికి రాత్రే ధనవంతులు కావాలనే అత్యాశ లాంటి సమకాలీన అంశాలను టీజర్ లో స్పష్టంగా చూపించారు. డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు, దాని చుట్టూ అల్లుకున్న కుటుంబ పరిస్థితులు కథలో కీలకం కానుందని అర్థమవుతోంది. లక్ష్మీ ప్రియా చంద్రమౌళితో సముద్రఖని కుటుంబ సన్నివేశాలు ఆకట్టుకోగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచి క్యూరియాసిటీ పెంచారు. రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి అని చివర్లో వచ్చే డైలాగ్ ప్రేక్షకుల్లో ఆలోచన రేకెత్తిస్తోంది.

# పాకిస్తాన్ ప్లేయర్ వింత రనౌట్..

ఢాకా వేదికగా బంగ్లాదేశ్ తో జరుగుతున్న రెండో వన్డేలో పాకిస్తాన్ స్టార్ ప్లేయర్ సల్మాన్ అలీ అఘా వివాదస్పద రీతిలో రనౌటయ్యాడు. అతడు ఔటైన తీరు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన పాకిస్తాన్ కు ఓపెనర్లు మాజ్ సదాకత్(75), ఫర్హాన్(31) మంచి ఆరంభం ఇచ్చారు.

ఆ తర్వాత పాక్ వెంటవెంటే మూడు వికెట్లు కోల్పోయి బ్యాక్ ఫుట్ లోకి వెళ్లింది. ఈ క్రమంలో సీనియర్ బ్యాటర్లు సల్మాన్ అలీ అఘా(64), మహ్మద్ రిజ్వాన్(44) నిలకడగా ఆడి తమ జట్టును భారీ స్కోర్ దిశగా నడిపించారు. అయితే పాక్ ఇన్నింగ్స్ 39 ఓవర్ వేసిన మోహది హసన్ మిరాజ్ బౌలింగ్ లో సల్మాన్ అలీ ఊహించని విధంగా ఔటయ్యాడు.

ఆ ఓవర్ లో మెహదీ వేసిన నాలుగో బంతిని మహమ్మద్ రిజ్వాన్ స్ట్రెయిట్ షాట్ ఆడాడు. ఆ బంతి నాన్-స్ట్రైకర్ ఎండ్ లో ఉన్న సల్మాన్ అలీ ఆఘా బ్యాట్ కు తగిలింది. ఆ సమయంలోనే బౌలర్ మిరాజ్, సల్మాన్ ఒకరినొకరు ఢీకొన్నారు. అయితే బంతి 'డెడ్' అయిందని భావించిన సల్మాన్, దానిని చేత్తో తీసి బౌలర్ కు ఇవ్వబోయాడు. కానీ అదే సమయంలో బంతిని అందుకున్న మిరాజ్ స్టంప్స్ ను గిరాటేశాడు. వెంటనే రనౌట్ కు అప్పీల్ చేయగా ఫీల్ అంపైర్ లు థర్డ్ అంపైర్ కు రిఫర్ చేశారు. స్టంప్స్ కిందపడే సమయానికి సల్మాన్ క్రీజు బయట ఉండడంతో థర్డ్ అంపైర్ ఔట్ గా ప్రకటించాడు. సల్మాన్ అలీ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. గ్రౌండ్ లోనే తన గ్లౌవ్స్, హెల్మెట్ ను నేలకేసి కొట్టాడు.



అంతేకాకుండా బంగ్లా కెప్టెన్ మిరాజ్ తో పాటు వికెట్ కీపర్ లిట్టన్ దాస్ తో సల్మాన్ వాగ్వాదానికి దిగాడు. అంపైర్ లు జోక్యంతో చేసుకోవడంతో సల్మాన్ నిరాశతో మైదానాన్ని వీడాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

**రూల్స్ ఏమి చెబుతున్నాయి?**

బంతి లైవ్ లో ఉన్నప్పుడు బ్యాటర్ బంతిని బ్యాట్ తో కానీ చేతితో కానీ టచ్ చేయకూడదు. ఫీల్డర్ అనుమతి లేకుండా బ్యాటర్ కావాలని బంతిని తాకినా లేదా ఫీల్డర్ ను అడ్డుకున్నా 'అబ్ స్ట్రాకింగ్ ది ఫీల్డ్' గా పరిగణిస్తారు. ఒకవేళ మిరాజ్ స్టంప్స్ పడగొట్టకుండా.. 'అబ్ స్ట్రాకింగ్ ది ఫీల్డ్' అప్పీల్ చేసినా సల్మాన్ ఔటయ్యే వాడు. ఎందుకంటే అప్పటికే సల్మాన్ క్రీజుకు సుమారు ఒక అడుగు దూరంలో ఉండి, బంతిని బౌలర్ కు అందించడానికి ప్రయత్నించాడు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 47.3 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది.

# శుభ్‌మన్‌కు ఉత్తమ క్రికెటర్ అవార్డు!

బీసీసీఐ వార్షిక ఉత్తమ క్రికెటర్ గా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్ మన్ గిల్ ఎంపికయ్యాడు. అయితే అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. మార్చి 15న ఈ అవార్డుల కార్యక్రమం జరగనుంది. 2025లో శుభ్ మన్ టెస్టుల్లో 983 పరుగులు చేశాడు. ఒక్క ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ లోనే అతడు 754 పరుగులు సాధించాడు. వన్డేల్లో 490 పరుగులు చేసిన శుభ్ మన్.. ఛాంపియన్స్ ట్రోఫీలో 188 పరుగులు సాధించి జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. మొత్తంగా గతేడాది అన్ని ఫార్మాట్లు కలిపి ఈ భారత స్టార్ 1764 పరుగులు సాధించాడు. ఇందులో 7 సెంచరీలు, 3 అర్ధసెంచరీలు ఉన్నాయి. టీ20ల్లో రాణించకపోవడంతో ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ లో శుభ్ మన్ కు భారత జట్టులో చోటు దక్కలేదు. టీమ్ఇండియా మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ కు కల్నల్ సీకే నాయుడు జీవిత కాల సాఫల్య అవార్డు లభించనుంది. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు ద్రవిడ్ కోచ్ గా ఉన్నాడు.



# అర్జున్ దాస్‌కి బ్రేకప్ అయ్యిందా?

తన గంభీరమైన గొంతు తోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడే అర్జున్ దాస్. తమిళ్ సహ తెలుగులో కూడా తనకి మంచి ఆదరణ ఉంది. అయితే ఇటీవల ఓజి సినిమాలో సాలిడ్ రోల్ దక్కించుకున్న తను ఇప్పుడు తమిళ్ లో బిజీగా ఉన్నాడు.



ఈ నేపథ్యంలో అర్జున్ దాస్ చేసిన ఓ లవ్ బ్రేకప్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నువ్ ఎవరినైనా అమితంగా ప్రేమిస్తే వాళ్ళు నిన్ను వదిలేస్తారు. అసలు ఎలా ఒకరు మూవ్ ఆన్ అవుతారు అంటూ తన ఇన్స్టాగ్రామ్ లో స్టోరీ పెట్టడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే నిజంగానే అర్జున్ దాస్ కి బ్రేకప్ అయ్యిందా లేక ఏదన్నా సినిమా ప్రమోషన్ కోసం ఇలా చేస్తున్నారా అంటూ మరికొన్ని కామెంట్స్ వినిపిస్తున్నాయి. సో దీనిపై డైరెక్ట్ అర్జున్ దాస్ నుంచే ఓ క్లారిటీ రావాల్సి ఉంది.

# బీసీసీఐ వీడియో అనలిస్టుపై నిషేధం

రంజీ ట్రోఫీ మ్యాచ్ లో ఫిక్సింగ్ చేసేందుకు ఆటగాడిని ప్రోత్సహించిన బీసీసీఐ వీడియో అనలిస్ట్ పై యాంటీ కరప్షన్ యూనిట్ చర్య తీసుకుంది. ఆంధ్ర క్రికెట్ జట్టు వీడియో అనలిస్ట్ రాజా రెడ్డిపై నిషేధం విధిస్తున్నట్లు బోర్డు అంబుడ్స్ మన్ ప్రకటించాడు. రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై బోర్డు విచారణ పూర్తి చేసింది. 2023-24 సీజన్ లో భాగంగా ఇండోర్ లో మధ్యప్రదేశ్ తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది.

ఈ మ్యాచ్ లో ఆంధ్ర ఆటగాడు గిరినాథ్ రెడ్డిని ఫిక్సింగ్ చేసేందుకు రాజారెడ్డి ప్రోత్సహించాడు. దాంతో ఈ విషయాన్ని అతను వెంటనే టీమ్ మేనేజర్ జుగల్ కిషోర్ కు తెలియజేశాడు. అనంతరం దీనిపై రాజారెడ్డి వాట్సప్ తదితర సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటా విచారణ చేపట్టిన యాంటీ కరప్షన్ యూనిట్ తమ నివేదికను అందించింది.

# వెస్టిండీస్ స్టార్ సంచలన నిర్ణయం

వెస్టిండీస్ స్టార్ స్పిన్నర్ గుడకేశ్ మోతీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ 2026 నుంచి వైదొలిగాడు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత మోతీ విండీస్ జట్టుతో పాటు పశ్చిమ ఆసియాలో యుద్ధం కారణంగా వారం రోజుల పాటు భారత్ లో చిక్కుకుపోయాడు. ఇప్పుడు మరోసారి ఆసియాకు ప్రయాణించి రిస్క్ తీసుకోడదని అతడు భావించినట్లు సమాచారం. ఈ ఏడాది పీఎస్ఎల్ సీజన్ లో మోతీ లాహోర్ ఖలందర్స్ కు ప్రాతినిథ్యం వహించాల్సి ఉండేది. కానీ ఇప్పుడు అతడు గైర్హాజరీలో శ్రీలంక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ దునిత్ వెల్లలాగేను లాహోర్ తమ జట్టులోకి తీసుకుంది.



మోతీతో పాటు జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ పాకిస్తాన్ సూపర్ లీగ్ నుంచి తప్పుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అతడు ఐపీఎల్ లో కోల్ కతా నైట్ రైడర్స్ తో ఒప్పందం కుదుర్చుకునే అవకాశముంది. కాగా ఈ ఏడాది పీఎస్ఎల్ సీజన్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది. లాహోర్ ఖలందర్స్ కెప్టెన్ గా షాహీన్ అఫ్రిది వ్యవహరించనున్నాడు.

# నాని నెకస్ట్‌పై క్రేజీ బజ్!



నాచురల్ స్టార్ నాని ఇప్పుడు చేస్తున్న ది ప్యారడైజ్ సినిమాతో నెక్స్ట్ లెవెల్ కి వెళుతున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా తర్వాత మరింత క్రేజీ లైనప్ ని నాని సిద్ధం చేసుకున్నాడు. వీటిలో దర్శకుడు సుజీత్ తో 'బ్లడీ రోమియో' అనే భారీ చిత్రం చేయనున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత తదుపరి సినిమా కూడా లాక్ అయిపోయినట్టు ఇప్పుడు వస్తుంది. ఈ కాంబినేషన్ కూడా ఒక ఊహించని కలయికే అన్నట్టు తెలుస్తుంది. ఈసారి నాని దర్శకుడు వెంకీ అట్లూరితో సినిమా చేయనున్నట్టు టాక్. ఆల్రెడీ నాని కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టు తెలుస్తుంది. అలాగే ఈ చిత్రాన్ని ఇప్పుడు వెంకీతో వరుసగా సినిమాలు చేస్తున్న యువ నిర్మాత సూర్య దేవర నాగవంశీ కాంబినేషన్ లో దీనినీ లాక్ చేసినట్టు టాక్. మరి దీనిపై అధికారిక క్లారిటీ బయటకి రావాల్సి ఉంది.

# చిరంజీవికి దిల్ రాజు ఆహ్వానం



ప్రముఖ నటుడు చిరంజీవి ని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు, టీఎఫ్‌డీసీ ఎండీ ప్రియాంక మర్యాదపూర్వకంగా కలిశారు. గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన్ను ఆహ్వానించారు. ఎన్టీఆర్ నేషనల్ అవార్డుకు చిరంజీవి ఎంపికైన సంగతి తెలిసిందే. ఉగాది సందర్భంగా ఈ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నారు.

# ఆశను కోల్పోవద్దు.. - హన్సిక



నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు. విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్దీ కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం.

2022 డిసెంబర్ లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్ గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది.

# నేను వంట చేస్తే శోభిత రుచి చూసి చెబుతుంది - నాగచైతన్య



నాగచైతన్య అంటే కేవలం హీరోగానే చాలా మందికి తెలుసు. కానీ, ఆయన మల్టీ టాలెంటెడ్. లాక్ డౌన్ సమయంలో క్లౌడ్ కిచెన్ మెనూలను డిజైన్ చేసిన వారిలో ఒకరు. రేస్ ట్రాక్ పై రయ్ రయ్ మంటూ దూసుకెళ్లగలరు. దక్షిణాదిలో అత్యంత అధునాత సౌండ్ మిక్సింగ్ స్టూడియోను నెలకొల్పడంతో కీలక పాత్ర పోషించారు. సినిమా కోసం ఏదైనా చేయడానికి సిద్ధమంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. చాలా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**కరోనా అన్నింటినీ మార్చేసింది..**

"నేను క్లౌడ్ కిచెన్ ఏర్పాటు చేయడానికి షోయూ స్ఫూర్తి. జపనీస్ వంటకాలు నాకెంతో నచ్చుతాయి. నేను ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా జపనీస్ వంటకాలు మొదట రుచి చూడటానికి ఇష్టపడతా. ఆ రుచి హైదరాబాద్ వాసులకు అందించాలనుకున్నా. ఓపెన్ రెస్టారెంట్ గా ప్రారంభించాలన్న ఆలోచన ఉండేది. కానీ, కరోనా అన్నింటినీ మార్చేసింది. అప్పుడు మార్కెట్ లో క్లౌడ్ కిచెన్ కు చాలా అవకాశం ఉందనిపించింది. రెస్టారెంట్ లో ప్లేట్ లో పెడితే, క్లౌడ్ కిచెన్ లో ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి పంపిస్తారు. ఇక్కడ ఏదీ కనిపించదు. కేవలం ప్యాకెట్ మాత్రమే డోర్ డెలివరీ అవుతుంది. ఈ ఆహారం విషయంలో ఎలాంటి పొరబాటు జరగకూడదు. వినియోగదారులకు పంపే ముందు అన్ని రకాలుగా పరీక్షించి పంపిస్తాం'' అని అన్నారు.

**నాన్నకు పిజ్జాలు ఇష్టం..**

ఖాళీ సమయంలో ఇంటి దగ్గర తాను కొత్త కొత్త వంటకాలను ప్రయత్నిస్తూ ఉంటానని నాగచైతన్య చెప్పుకొచ్చారు. వాటిని తన సతీమణి శోభిత మొదట రుచి చూసి, ఫీడ్ బ్యాక్ ఇస్తారని తెలిపారు. దానిని బట్టే కొత్త మెనూ సిద్ధమవుతుందన్నారు. ఈ విషయంలో తన కుటుంబ సహకారాన్ని మర్చిపోలేనన్నారు. తన తండ్రి నాగార్జునకు పిజ్జాలు అంటే ఇష్టమని, ఆదివారం స్విగ్గీ నుంచి కొత్తరకం పిజ్జాలు తెప్పించుకుని మరీ తింటారని నవ్వుతూ చెప్పారు.

**ఇంతకుముందెప్పుడూ చూడని అంశం..**

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో 'తండేల్'లో నటనకు గానూ ఉత్తమ నటుడు అవార్డుకు ఎంపికవడంపై నాగచైతన్య సంతోషం వ్యక్తం చేశారు. "'తండేల్' నా హృదయానికి చాలా దగ్గరైన కథ. అది నిజంగా సాహసవంతమైన ప్రయాణం. మనం నిజంగా కష్టపడితే గుర్తింపు తప్పకుండా వస్తుంది. అలా వచ్చింది జీవితాంతం ఉత్సాహాన్ని ఇస్తూనే ఉంటుంది'' అని అన్నారు. ప్రస్తుతం కార్తిక్ దండు దర్శకత్వంలో నటిస్తున్న 'వృషకర్మ' లార్జర్ దేన్ లైఫ్ కథ అని నాగచైతన్య తెలిపారు. చివరి 25 నిమిషాలు ప్రేక్షకుడిని మరో ప్రపంచానికి తీసుకెళ్తుందన్నారు. ఇండియన్ సినిమా చరిత్రలో ఇంతకుముందెన్నడూ చూడని సరికొత్త అంశాన్ని చూస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'దూత2' ప్రస్తుతం స్క్రిప్ట్ లో దశలో ఉన్నట్లు వెల్లడించారు.



# ఎంజీఆర్‌పై కాంట్రవర్సీ కామెంట్స్‌పై నట కిరీటి క్షమాపణ!

మన టాలీవుడ్ దిగ్గజ నటుల్లో ఒకరైన నట కిరీటి రాజేంద్రప్రసాద్ ఈ మధ్య కాలంలో పలు కాంట్రవర్సీ లలో కూడా కనిపిస్తున్నారు. తాజాగా తమిళ దిగ్గజ నటుడు ఎం జి ఆర్ పై ఓ సినిమా ఈవెంట్ లో చేసిన కామెంట్స్ తీవ్ర వివాదానికి దారి తీశాయి. తెలుగు సినిమా నటుడు కాంతారావు గారి హయాంలో ఎం జి ఆర్ పరిస్థితిపై పలు షాకింగ్ కామెంట్స్ చేయడం కోలీవుడ్ ఆడియెన్స్ ని హర్ట్ చేసింది.

దీనితో విశాల్, నాజర్ లాంటి నటులు కూడా రాజేంద్రప్రసాద్ కామెంట్స్ ని ఖండించారు. ఇక ఈ వివాదంపై రాజేంద్రప్రసాద్ లేటెస్ట్ గా ఓ వీడియో విడుదల చేసి తను ఎం జి ఆర్ పై చేసిన కామెంట్స్ ని వెనక్కి తీసుకుంటున్నాను అని అలాగే ఇక ముందు కూడా ఆచితూచి వ్యవహరిస్తాను అని క్షమాపణలు కోరారు. దీనితో తన లేటెస్ట్ క్లారిటీ వైరల్ గా మారింది. వీటితో ఈ వివాదానికి తెరపడింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.